# పాడి పంటలు

సంపుటి - 01 సంచిక - 03
సెప్టెంబర్ - 2024 పేజీలు - 44
వెల : రూ. 25/-

వ్యవసాయ, ఉద్యాన మరియు పట్టు ప... పత్రిక

# నవ్య దిశలో వ్యవసాయ రంగం

వినాయక చవితి శుభాకాంక్షలతో...



# తస్మాత్ జాగ్రత్త



రాష్ట్రంలో బెట్ట పరిస్థితుల దృష్ట్యా పత్తిలో తామర పురుగుల ఉధృతి పెరుగుతోంది. తద్వారా తలమాడు తెగులు వ్యాపించే అవకాశం ఎక్కువగా ఉంది.





## నష్ట పరిచే విధానం:

- పిల్ల మరియు తల్లి పురుగులు ఆకుల అడుగు భాగాన చేరి గీకి రసాన్ని పీలుస్తాయి.
- ఆకులు ముడుచుకొని పెళుసుగా మారుతాయి.
- ఆకుల అడుగుభాగాన ఈనెల వెంబడి వెండి వలే చారలు ఏర్పడతాయి.
- తలమాడు తెగులు (టొబాకో స్ట్రీక్ వైరస్) వ్యాప్తికి తామర పురుగులు దోహద పడతాయి.

## అనుకూల పరిస్థితులు:

- వర్షాలు తక్కువగా వుండి ఉష్ణోగ్రతలు ఎక్కువగా వుంటే వీటి ఉధృతి ఎక్కువగా వుంటుంది.
- పొడి వాతావరణ పరిస్థితుల్లో తామర పురుగుల సంఖ్య ఒక్కసారిగా పెరుగుతుంది.




- **బెట్ట పరిస్థితులలో ఇమిడాక్లోప్రిడ్, ఎసిటామిప్రిడ్, థయామిథాక్సమ్ వంటి నియోనికోటినాయిడ్ మందులను పిచికారీ చేసినప్పుడు తామరపురుగుల ఉధృతి పెరిగినట్లు గమనించడం జరిగింది.**





## నివారణ చర్యలు:

- కలుపు మొక్కలు తామర పురుగులకు ఆశ్రయం కలిగిస్తాయి కనుక పంట తొలిదశలో కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి.
- పురుగుల ఉధృతి తెలుసుకోవడానికి నీలం రంగు జిగురు అట్టలను ఎకరాకు 20 చొప్పున పెట్టాలి.
- ఆకుకు 10 తామర పురుగులు ఉన్నపుడు ఆర్థిక సహన స్థితికి చేరుకుంటాయి.
- అవసరాన్ని బట్టి ఎకరాకు ఎసిఫేట్ 75% ఎస్.పి. 300 గ్రా. లేదా ఫిప్రోనిల్ 5% ఎస్.సి. 400 మి.లీ. లేదా ఫ్లోనికామిడ్ 50% డబ్ల్యూ.జి. 60 గ్రా. లేదా స్పైనిటోరం 11.7% ఎస్.సి. 170 మి.లీ. లేదా ఫిప్రోనిల్ 15% + ఫ్లోనికామిడ్ 15% డబ్ల్యూ.జి. 160 గ్రా. 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి.

# పాడి పంటలు




ప్రధాన సంపాదకులు
**శ్రీ ఎస్. ఢిల్లీ రావు,** ఐ.ఏ.ఎస్.
డైరెక్టర్ వ్యవసాయ శాఖ





సంపాదకులు
**శ్రీ వల్లూరి శ్రీధర్**
జాయింట్ డైరెక్టర్, విస్తరణ విభాగము

కార్యనిర్వాహక సంపాదకులు
**శ్రీ వి. హరగోపాలరాజు**

సహాయ సంపాదకులు
**శ్రీమతి వై. అనురాధ,** డిడిఎ
**శ్రీ డి. వెంకటేశ్వర్లు,** డిడిఎ
**డా॥ బి.ఎస్. శ్రీనివాసాచార్యులు,** ఎ డిఎ
**శ్రీ జె. వెంకటరావు,** ఎ డిఎ
**శ్రీ కె. ఆంజనేయ కుమార్,** ఎ ఒ



*రచనలు పంపాల్సిన చిరునామా :*
వ్యవసాయ కమీషనర్ వారి కార్యాలయం
చుట్టుగుంట, పాత మిర్చియార్డు, గుంటూరు
E-mail : mediaproductionap@gmail.com



'పాడి పంటలు' సంచిక డిజిటల్ ఎడిషన్
apagrisnet.gov.in అందుబాటులో ఉంది


## విషయసూచిక




సెప్టెంబర్ -24


| | |
|---|---|
| సంపాదకీయం | |
| పెట్టుబడి రాయితీగా రూ. 36 కోట్లు విడుదలకు ఆదేశం | 5 |
| సార్వా వరి సాగుతో సత్ఫలితం | 6 |
| ఈ మాసం వ్యవసాయ పనులు | 8 |
| పత్తి..గులాబీ రంగు పురుగు సమగ్ర సస్యరక్షణ | 10 |
| శనగ సాగు నేల తయారీలో జాగ్రత్తలు | 12 |
| రబీ కంది సాగు అవకాశాలు | 14 |
| వేరుశనగ సాగు తెగుళ్ళు నివారణ | 16 |
| చెరకుని ఆశించే పురుగులు నివారణ చర్యలు | 18 |
| ఆరోగ్యకరమైన వరి సాగుకు ఆచరణీయ పద్ధతులు | 20 |
| రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి | 22 |
| చిత్రమాలిక | 23 |
| మిరప సాగు యాజమాన్య పద్ధతులు | 24 |
| అధిక సాంద్ర పద్ధతిలో బత్తాయి సాగు | 26 |
| త్రివేణి సంగమం..వెలగ పండు | 28 |
| తామర పురుగులు సస్యరక్షణ | 30 |
| తమలపాకు సస్యరక్షణ | 32 |
| సెప్టెంబర్ లో ఉద్యాన పంటల్లో చేపట్టవలసిన పనులు | 34 |
| 80 శాతం రాయితీపై విత్తనాలు అందించండి | 36 |
| రైతుల సందేహాలు – సమాధానాలు | 37 |
| సందేహాలు – సమాధానాలు | 39 |
| సమీకృత రైతు సమాచార కేంద్రానికి రైతులు తరచూ అడిగే ప్రశ్నలు | 41 |
| సమీకృత రైతు సమాచార కేంద్రంపై రైతుల స్పందన | 42 |



**'పాడి పంటలు' సచిత్ర మాసపత్రిక సంవత్సర చందా – రూ.300/–**
యూనియన్ బ్యాంక్, గోరంట్ల శాఖ ఖాతా నెం. 069610100200430 కు నేరుగా గూగుల్ పే, ఫోన్ పే ద్వారా పంపవచ్చు. డి.డి.లు పంపాల్సిన చిరునామా : ది ఎడిటర్, 'పాడి పంటలు' మాసపత్రిక, వ్యవసాయ కమీషనర్ కార్యాలయం చుట్టుగుంట, పాత మిర్చియార్డు, గుంటూరు

సంపాదకీయం

# నవ్య దిశలో వ్యవసాయ రంగం

**రా**ష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని నవ్య దిశలో నడిపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కృత నిశ్చయంతో ఉన్నారు. అందుకే రైతు కుటుంబం నుంచి వచ్చిన కింజరాపు అచ్చెన్నాయుడుకు కీలకమైన వ్యవసాయ, అనుబంధ రంగాలే కాకుండా, గతంలో ప్రత్యేక శాఖగా ఉన్న పశు సంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధిని కూడా ఒకే మంత్రిత్వశాఖ కిందకు తెచ్చి అప్పగించారు. దీనివల్ల ప్రధాన రంగాల మధ్య సమన్వయం మరింతగా బలపడి సత్ఫలితాలు సాధించవచ్చని ముఖ్యమంత్రి వర్యుల యోచన.

62 శాతం జనాభా వ్యవసాయ,అనుబంధ రంగాలపై ఆధారపడిన రాష్ట్రంలో వ్యవసాయ రంగ అభివృద్ధికి, **ప్రకృతిలో ఆరు రుతువులు ఉన్నట్టే అన్నదాతల సంక్షేమానికి ఆరు ప్రధాన కార్యక్రమాలను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోంది.** వీటిలో ప్రధానంగా **అన్నదాత సుఖీభవ** పథకం కింద పెట్టుబడి సాయం కింద రైతులకు ఏడాదికి రూ. 20 వేలు ఇవ్వాలని నిర్ణయించింది. ఇందుకు అర్హులైన రైతులను గుర్తించ చేందుకు మార్గదర్శకాలు రూపొందుతున్నాయి. అలాగే **కౌలు రైతులకు గుర్తింపు కార్డుల జారీ.** 2024–25 సంవత్సరానికి ఇప్పటికే 6 లక్షల మందికి కౌలు రైతు హక్కు పత్రాలు జారీ చేశారు. మరో నాలుగు లక్షల మందికి ఇవ్వాల్సి ఉంది. సహేతుకమైన **పంటల బీమా** ...ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోయిన పరిస్థితుల్లో కౌలు రైతులు సహా బాధితులందరికీ పక్కాగా నష్టపరిహారం అందాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఈ దిశగా మంత్రి వర్గం ఉపసంఘం సిఫార్సుల మేరకు కొత్త పంటల బీమా పథకం వచ్చే ఖరీఫ్ నుంచి అమలు చేయనుంది. **రైతులకు వ్యక్తిగతంగా వ్యవసాయ పరికరాల సరఫరా.** రాయితీపై ఇవి పంపిణీ చేస్తే కర్షకులకు ఎక్కువ లబ్ధి కలుగుతుందనేది రాష్ట్ర ప్రభుత్వ యోచన.

అంతేకాకుండా **రైతు ఉత్పత్తి దారుల సంఘాలను ఏర్పాటు చేసి గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్** కింద మేలైన సాగు పద్ధతులు ఆచరింపజేసి నాణ్యమైన పంట ఉత్పత్తులతో, అటు ఉత్పత్తులకు అంతర్జాతీయంగా ఖ్యాతి, పండించిన రైతులకు మార్కెట్ రేట్ కన్నా అధిక గిట్టుబాటు ధర రావాలన్నది ప్రభుత్వ లక్ష్యం. మండలానికి ఒకటి చొప్పున 1,300 మండలాల్లో 2024–25 ఖరీఫ్, రబీ పంట కాలాల్లో వీటిని అమలు చేయడానికి ఈ కార్యక్రమానికి రూ. 10.61 కోట్లు కేటాయించింది. వినూత్న పంథాలో విస్తరణ సేవలు వ్యవసాయ అనుబంధ రంగాల సేవలను రైతు ముంగిటకు చేర్చాలి..రైతుకు పెట్టుబడి తగ్గాలి, పంట దిగుబడులు పెరగాలి.. నికర ఆదాయం మెరుగవ్వాలి. ఇవే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం **పొలం పిలుస్తోంది** కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమం కింద వారానికి రెండుసార్లు వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులు, శాస్త్రవేత్తలు పొలం బాట పట్టి రైతులకు తోడుగా నిలుస్తారు.

అలాగే 2024–25 సంవత్సరానికి రైతులకు పంట రుణాల కింద 1,66,000 కోట్లు, రూ. 98,000 కోట్లు వ్యవసాయ పంట రుణాలుగా ఇవ్వాలని ఇప్పటికే బ్యాంకులకు నిర్దేశించింది.

మరోవైపు రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు పూర్తికి కేంద్రం సంపూర్ణ సహకారం అందించనున్న నేపథ్యంలో రాష్ట్ర రైతులకు మరింత సాగునీటి సౌలభ్యం కలగనుంది.

రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గించి, నికర ఆదాయం పెంపు లక్ష్యం గా సేంద్రియ సాగు పద్ధతులను గణనీయంగా ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళిక రచిస్తోంది. దీనివల్ల రైతులు రసాయనిక ఎరువులు, పురుగు మందుల మీద పెట్టే ఖర్చు గణనీయంగా తగ్గనుంది.

కూలీల కొరత నేపధ్యంలో డ్రోన్లను రైతులకు అందుబాటులోకి తేవాలనుకుంటోంది. ఇప్పటికే ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం పెద్ద సంఖ్యలో రైతులకు డ్రోన్ పైలట్ శిక్షణ ఇచ్చి, ధ్రువపత్రాలు కూడా ఇచ్చింది. వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగంతో గణనీయమైన మార్పులు రానున్నాయి. డ్రోన్ తో ఒక ఎకరానికి 6 నిమిషాల్లోనే మందులు పిచికారీ చేయవచ్చు. ఈ రంగంలో గ్రామీణ నిరుద్యోగ యువతకు స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. వీటిని ఎలా రైతులకు అందించాలన్న విషయమై కసరత్తులు చేస్తోంది.

వాతావరణ పరిస్థితులు క్రమంగా మారిపోతున్నాయి. ప్రజలకు ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది. ఆహార అలవాట్లు, అభిరుచులు మారుతున్నాయి. రైతులు కూడా తమ చేతిలో ఉన్న ఫోన్లలోనే అన్ని విషయాలు తెలుసుకోగలుగుతున్నారు. అందువల్ల నేటి కాలంలో తమ శ్రమకు తగిన ఫలితం రావాలంటే పంట ఉత్పత్తులకు విలువ జోడించాలి. మార్కెట్ అవసరాలు తెలుసుకోగలగాలి. ఉద్యానమైనా మరేదైనా విలువ ఆధారిత ఉత్పత్తులు రైతులకు అధిక ఆదాయాన్ని ఇవ్వడమే కాకుండా వ్యాపార, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పరుస్తాయనడంలో సందేహం లేదు. ఆ దిశలో రైతులకు మద్దతుగా నిలిచి ముందుకు నడిపించాలనేది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం.



# పెట్టుబడి రాయితీగా రూ. 36 కోట్లు విడుదలకు ఆదేశం

## వ్యవసాయ శాఖ, అనుబంధ రంగాలపై సమీక్షలో ముఖ్యమంత్రి

జులైలో కురిసిన భారీ వర్షాల కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులకు పెట్టుబడి రాయితీ కింద రూ.36 కోట్లు విడుదల చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. ఆగస్టు 8న ముఖ్యమంత్రి వ్యవసాయ శాఖ, అనుబంధ రంగాలపై సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సి.ఎం. మాట్లాడుతూ రాష్ట్రంలో విత్తన కొరత లేకుండా చూడాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. రాష్ట్రంలో వంద శాతం ఈ-పంట నమోదు చేయాలని అధికారులకు నిర్దేశించారు. పెట్టుబడి వ్యయాన్ని తగ్గించి, నికర ఆదాయం పెరిగేలా వ్యవసాయంలో తగిన మార్పులు తేవాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. అన్నదాత-సుఖీభవ పథకం కింద ఆర్థిక సాయం అందించేందుకు త్వరలో మార్గదర్శకాలు విడుదల చేస్తామన్నారు. పురుగు మందుల పిచికారీకి డ్రోన్ల వినియోగం పెంచాలని, కేంద్ర పౌర విమానయాన శాఖ తో మాట్లాడి, త్వరలో డ్రోన్ల టెస్ట్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. వ్యవసాయ శాఖ పథకాలు, కార్యక్రమాలు, ఆ రంగం అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సి.ఎం.కు వివరించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ వ్యవసాయంలో ఉత్పత్తిని పెంపొందించడంతో పాటు రైతుకు నికర ఆదాయాన్ని పెంచేలా సాంకేతికతను వినియోగించాలన్నారు. సాగులో ఉత్తమ విధానాలను అవలంబించడం ద్వారా ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచడం తోపాటు రైతుకు నికరాదాయాన్ని పెంచే రీతిలో సమగ్ర విధానాన్ని రూపొందించాలన్నారు. నేలల్లో తేమను గుర్తించేందుకు శాటిలైట్ సేవలను వినియోగించుకోవాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో అరటి, మామిడి, నిమ్మ, ఆయిల్ పామ్, కొబ్బరి, కాఫీ, టమోటా వంటి పంటల సాగులో దేశంలో మొదటి నాలుగు స్థానాల్లో ఉన్నామని, రానున్న రోజుల్లో ఉద్యాన పంటల్లో దేశంలో అగ్రగామిగా ఉండేందుకు తగిన కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఉద్యాన శాఖపై జరిగిన సమీక్షలో అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ వచ్చే రెండు మూడేళ్లలో ఉద్యాన పంటల్లో ఉత్పత్తి, ఉత్పాదకత గణనీయంగా పెంచి రైతులకు ఆదాయం పెరిగేలా చూడాలని సూచించారు. ఈ రంగానికి సంబం ధించి 2014-19 మధ్య కాలంలో ఉన్న పథకాలన్నీ మళ్ళీ అమలు లోకి తీసుకురావాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. 15 శాతం జీఎస్డీపీని సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశిం చారు. ఉద్యాన పంటల ప్రోత్సాహానికి సంబంధించి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, మార్కెటింగ్, రవాణా సౌకర్యాలు, కోల్డ్ స్టోరేజీలు, తక్కువ ఖర్చుతో రవాణా వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. 2024-25లో లక్ష ఎకరాలను సూక్ష్మ సేద్యం కింద అదనంగా సాగులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు వివరించారు. ఆయిల్‌పామ్, కొబ్బరి, కోకో వంటి పంటల్లో మెరుగైన ఉత్పత్తి సాధించేందుకు సమగ్రమైన విధానాలు అవలంబించాలని అన్నారు. సమీక్షలో వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



విజయగాథ

# సార్వా వరి సాగుతో సత్ఫలితం బోళ్ళపాడు గ్రామ రైతుల కృషి

**తొలిఅడుగు:** పంటల సాగులో చీడ, పీడలను అరికట్టాలి. రసాయన ఎరువులు, పురుగు మందుల విచక్షణారహిత వినియోగాన్ని నివారించాలి. సాగు ఖర్చులు పెరగడం వల్ల నాణ్యత లేని పంట ఉత్పత్తులు, ఫలితం మార్కెట్లో తక్కువ ధరకు అమ్ముకోవడం వల్ల లాభాలు నికర ఆదాయం తగ్గిపోతోంది. ఈ పరిస్థితులను మార్చేందుకే పొలంబడి, ఇండ్ గ్యాప్ సర్టిఫికేషన్ కార్యక్రమం అమలు చేయడానికి తొలి అడుగు పడింది.

ఈ కార్యక్రమాన్ని ముఖ్యంగా సేంద్రియ వ్యవసాయ పద్ధతులు, ప్రకృతి వ్యవసాయం చేయడానికి అవసరమైన, కషాయాల తయారీలో అవగాహన ఉన్న కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలం బోళ్ళపాడు గ్రామాన్ని ఎంపిక చేశారు.

ఈ గ్రామ రైతులు ప్రధానంగా వరి పంటను సాగు చేస్తున్నారు. సార్వా సీజన్ కు సంబంధించి ఎం.టి.యు 1061, ఎం.టి.యు. 1318 వంటి నాణ్యమైన రకాలను సాగు చేశారు.

**ఆచరణ:** పొలం బడి, ఇండ్ గ్యాప్ సర్టిఫికేషన్ కార్యక్రమంలో భాగంగా బోళ్ళపాడు గ్రామాన్ని క్లస్టర్‌గా తీసుకుని మొత్తం 23.74 హెక్టార్ల విస్తీర్ణంలో 60 మంది రైతులను ఎంపిక చేసి ఉయ్యూరు మండలం చిన్న ఓగిరాల గ్రామంలో ఉన్న (చిన్న ఓగిరాల ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్) రైతు ఉత్పత్తి దారుల సంఘంతో అనుసంధానం చేసి వరిలో పొలం బడి, ఇండ్ గ్యాప్ సర్టిఫికేషన్ కార్యక్రమాన్ని అమలు చేశారు.

**లక్ష్యం :** తక్కువ పెట్టుబడితో నాణ్యమైన అధిక దిగుబడి సాధించడం. సాగు ఖర్చు తగ్గించడం, దిగుబడి పెంచడం, రైతుకి నికర ఆదాయం పెంచడం ముఖ్యమైనవి. పర్యావరణాన్ని పరిరక్షిస్తూ, నాణ్యమైన పంట పొందేందుకు కృషి. అంతేకాకుండా భూమిలో వానపాములు, సూక్ష్మజీవుల సంఖ్యను పెంచుతూ, భూమి ఆరోగ్యాన్ని పెంపొందించడం, భూసారం పెంపుదల, రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించడం.

**ప్రధాన భాగస్వాములు : వ్యవసాయ శాఖ :** రైతులకు పొలంబడి కార్యక్రమం ద్వారా సాంకేతిక సలహాలు ఇస్తూ అవి రైతులు ఆచరించే విధంగా చేయడం.

**APSOPCA :** ఇండ్ గ్యాప్ సర్టిఫికేషన్ మీద నాణ్యత పర్యవేక్షణ పద్ధతి(QMS) బృందానికి శిక్షణ ఇవ్వడం, రైతులు పండించిన

పంటల నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించడం, తద్వారా పండించిన నమూనాలు, ఫలితాలు ఆధారంగా రైతులకు ఇండ్ గ్యాప్ సర్టిఫికెట్ ఇప్పించడంలో ముఖ్య పాత్ర వహిస్తుంది.

**ఎఫ్.పి.ఓ:** రైతు ఉత్పత్తిదారుల సంఘం ఇండ్ గ్యాప్ సర్టిఫికెట్ కోసం పొలంబడిలో ఎంపిక చేసిన రైతులను సభ్యులుగా చేర్చుకొని వారిని సంఘంలో భాగస్వాములను చేయడంలో ముఖ్యపాత్ర వహిస్తుంది.

రైతులు తాము పండించిన పంట ఉత్పతులన్ని ఒకేసారి మొత్తం అంతా కొనుగోలు చేయడంలో పంట కొనుగోలు చేసే రైతులు ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్ లో ఉన్నారా లేదా అని తనిఖీ చేసుకోవాలి. కొనుగోలు చేసిన పంటకు లాట్ నెంబర్ మంజూరు, కొనుగోలు రసీదు జారీ, రైతుల వివరాలు డిజిటల్ నమోదు, కొనుగోలు చేసిన పంటను భద్రపరచడంలో ముఖ్యపాత్ర వహిస్తారు.

**ఆచరించిన ఉత్తమ యాజమాన్య పద్ధతులు:** పొలం బడిలో భాగంగా రైతులందరూ వేసవిలో భూమిని ఖాళీగా ఉంచకుండా వేసవి దుక్కులు చేసుకోవడం, భూమిలో కార్బన్ శాతం పెంచుకోవడానికి పచ్చిరొట్ట పైర్లు సాగు చేసుకోవడం, దమ్ములో పైపాటుగా సూపర్, పొటాష్ ఎరువులు వేసుకోవడం వంటి ఉత్తమ యాజమాన్య పద్ధతుల పై పూర్తి స్థాయిలో అవగాహన పొంది, ఆచరించగలిగారు. పొలం బడి శిక్షణ కార్యక్రమంలో భాగంగా రైతులకు ఆరోగ్యవంతమైన పైరును పెంచడం మిత్ర పురుగులను సంరక్షించుకోవడం, ప్రతి వారం చేనును పరిశీలించడం, రైతును తన పొలం పనులలో అనుభవజ్ఞునిగా చేయడం, మట్టి నమూనాల సేకరణ, తాము పండించే పంటలపై ఎంత వరకు పరిజ్ఞానం ఉందో తెలుసుకునేందుకు, బ్యాలెట్ బాక్స్ టెస్ట్ నిర్వహణ, బృంద ప్రయోగాలు, కషాయాల తయారీ, విత్తన మొలక శాతం గురించి క్లుప్తంగా వివరించారు. ఈ పద్ధతిని అందరూ ఆచరించవచ్చని నిరూపించారు.

**మంచి అవగాహన కలిగింది**

ఇండ్ గ్యాప్ పొలం బడి కార్యక్రమం ద్వారా 14 వారాలు వ్యవసాయ అధికారుల సమక్షంలో పలు అంశాలపై శిక్షణ కార్యక్రమాలు జరిగాయి. తక్కువ ఖర్చుతో అనగా ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించి నాణ్యమైన దిగుబడి సాధించడం, భూమి ఆరోగ్యం పెంపుదల మీద అవగాహన కలిగింది

**-తుమ్మూరు శివారెడ్డి.**

**ఆరోగ్యకరమైన పంట పండించడం అలవరచుకున్నా**

ఇండ్ గ్యాప్ పొలం బడి కార్యక్రమం ద్వారా మిత్ర పురుగులు, వాటి ఉపయోగాలు, శత్రు పురుగులు అవి పంటకు చేసే హాని గురించి తెలుసుకున్నా. పొలాన్ని క్రమం తప్పకుండా పరిశీలించుకుని, దానికి తగిన యాజమాన్య పద్ధతులు ఆచరించా. ఆరోగ్యకరమైన పంట పండించడం అలవరచుకున్నా. **-గుంటక గోపిరెడ్డి**

| విశ్లేషణ | రైతు పద్ధతి | గ్యాప్ పద్ధతి | వ్యత్యాసం |
|---|---|---|---|
| పంట | వరి | వరి | |
| రకం | ఎం.టి.యు-1061 | ఎం.టి.యు-1061 | |
| సాగు ఖర్చు (ఎకరా) | రూ.35,950 | రూ.30,010 | రూ. 5,940 |
| సరాసరి దిగుబడి | 32 క్వింటాళ్లు | 35 క్వింటాళ్లు | 3 క్వింటాళ్లు |
| మార్కెట్ ధర | రూ. 2,203/క్వి | రూ. 2,600/క్వి | రూ. 397 |
| సగటు స్థూల ఆదాయం | రూ. 52,872 | రూ. 66,300 | రూ. 13,428 |
| సగటు నికర ఆదాయం | రూ. 16,922 | రూ. 36,920 | రూ. 19,988 |

| మొత్తం విస్తీర్ణం | రైతుల సంఖ్య | మొత్తం దిగుబడి (మె.ట.) | ఆదాయ అంచనా (రూ) | | |
|---|---|---|---|---|---|
| | | | రైతుల పద్ధతి | జి.ఎ.పి.పద్ధతి | వ్యత్యాసం |
| 50 ఎకరాలు | 60 | 120 | 26,43,600 | 31,20,000 | 4,76,400 |

# ఈ మాసం వ్యవసాయ పనులు

## సెప్టెంబర్ లో వరిలో చేపట్టవల్సిన పనులు



♦ సాధ్యమైనంత వరకు లేతవయస్సు వున్న నారును (25-35 రోజులు) నాటుకోవాలి.

♦ ముదురు నారు (40-55 రోజులు) నాటుకొవలసి వచ్చినపుడు నాట్లు దగ్గర దగ్గరగా, ఒత్తుగా వేసుకోవాలి మరియు సిఫారసు చేసిన ఎరువులను రెండు ధఫాలలో చిరుపొట్ట దశలో పూర్తి చేసుకోవాలి.

♦ వరి రైతులు సిఫారసు చేసిన మేరకే (పిలకల దశలో ఒక అంగుళం, చిరుపొట్ట దశలో రెండు అంగుళాలు) నీటిని వినియోగించుకుని మెరుగైన దిగుబడులు పొందాలి.

♦ కలుపు నివారణకు విత్తిన లేదా నాటిన8-10 రోజులకు పైరజోసల్ఫ్యూరాన్ ఇథైల్ ఎకరానికి 100 గ్రా. చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పొలంలో పిచికారీ చేయాలి. విత్తిన లేదా నాటిన 15-20 రోజులకు ఎకరానికి బిస్ ఫైరిబాక్ సోడియం 10% ఎస్.ఎల్. 100 మి.లీ. లేదా ట్రయఫోమేన్ 20% + ఇథాక్సీ సల్ఫ్యూరాన్ 10% డబ్ల్యుజి 60గ్రా. 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయడం ద్వారా గడ్డి మరియు వెడల్పాకు కలుపు మొక్కలను సమర్ధవంతంగా నివారించవచ్చు.

♦ కేవలం గడ్డి జాతి కలుపు ఎక్కువగా ఉంటే సైహలోఫాప్ బ్యుటైల్ 10% ద్రావకం 400 మి.లీ. లేదా ఫెనాక్సాఫాప్ ఇథైల్ 6.9% ఇ.సి. 400 మి.లీ ఒక ఎకరానికి చొప్పున పిచికారీ చేయాలి.

♦ విత్తిన లేదా నాటిన 25-30 రోజులకు సల్ఫ్యూరాన్ మిథైల్ + క్లోరిమ్యురాన్ ఇథైల్ 20% డబ్ల్యు.పి. 8 గ్రా. ఎకరానికి పిచికారీ చేయాలి. వెడల్పాటి ఆకులున్న కలుపు మొక్కలున్నట్లయితే ఎకరానికి 400 గ్రా. 2, 4డి. సోడియం సాల్ట్ 80% పొడి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

♦ సిఫారసు మేరకు మాత్రమే ఎరువుల యాజమాన్యం చేపట్టాలి. అధిక నత్రజని ఎరువులు వేసిన ఎడల పురుగులు, తెగుళ్ళ ఉధృతి పెరగడానికి అవకాశం ఉన్నది. నాటిన తరువాత పై పాటుగా కాంప్లెక్స్ ఎరువులు వేయరాదు. చిరుపొట్ట దశలో ఉన్న వరికి తప్పని సరిగా సిఫారసు చేసిన నత్రజనితో పాటు సిఫారసు మేరకు మ్యూరేట్ ఆఫ్ పోటాష్‌ని (MOP) గింజ నాణ్యత, బరువు, చీడ పీడలను తట్టుకునే శక్తి కొరకు తప్పక వాడాలి. తక్కువ నత్రజనితో పండించే ఎంటియూ 1318, స్వర్ణ రకాలు ఎకరానికి 24:24:24 కిలోలనత్రజని, భాస్వరం పొటాష్‌ను ఇచ్చే ఎరువులను మాత్రమే వేసుకోవాలి. అధిక నత్రజని ఎరువులు వాడితే వర్షాలకు ఎండాకు తెగులు వ్యాప్తి చెందే అవకాశం ఉంది.

♦ జీవన ఎరువులైన అజటొబాక్టర్, ఫాస్ఫోసాల్యుబు లైజింగ్ బ్యాక్టీరియా, పోటాష్ రిలీజింగ్ బ్యాక్టీరియాఎకరానికి 500 మి.లీ వాడుటవలన 20% రసాయనిక ఎరువుల వాడకం తగ్గించవచ్చు.

♦ ఆలస్యంగా నాట్లు వేసిన ప్రాంతాలలో ఉల్లికోడు రావడానికి అవకాశం ఉన్నది. నివారణకు నాట్లు వేసిన 10-15 రోజులకు ఎకరాకు 10 కిలోల కార్బోఫ్యురాన్ 3 జి గుళికలు వేయాలి.

♦ సార్వాలో ముందుగా ఊడ్చిన పొలాలలో కాండం తొలుచు పురుగు మరియు ఆకుముడత ఆశించే అవకాశం వున్నది. కాబట్టి ఈ క్రింద తెలిపిన విధంగా సస్యరక్షణ చేపట్టాలి. కాండం తొలుచు పురుగు, ఆకుముడత నివారణకు లీటరు నీటికి కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2గ్రా. లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 0.3 మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. చిరుపొట్ట దశలో ఎకరానికి కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు 8 కిలోలు లేదా కార్బోఫ్యురాన్ 3జి గుళికలు 10 కిలోలు లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 0.4జి గుళికలు 4 కిలోలు వేసుకోవాలి. దోమ ఎక్కువగా ఆశించే ప్రాంతాలలో ఈ పురుగుల నివారణకు ప్రొఫెనోఫాస్, ట్రైజోఫాస్, క్లోరిపైరిఫాస్, మోనోక్రోటోఫాస్, సింథటిక్ పైరిత్రాయిడ్ మందులు పిచికారీ చేయరాదు.

♦ ఎడతెరిపి లేని వర్షాలు కురిసే ప్రాంతాలలో బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు ఆశించే అవకాశం ఉన్నది. తెగులు నిర్ధారణ కోసం ఎండిన ఆకులను ముక్కలుగా కత్తిరించి మంచి నీటితో ఉన్న గాజుగ్లానులో వేయాలి. అరగంట తరువాత నీటిని గమనించినట్లయితే, తెగులు ఆశించిన భాగాలనుండి బ్యాక్టీరియా నీటిలోకి ప్రవేశించడం వల్ల నీటి గాఢత పెరగడం, పసుపు రంగుకు మారుతుంది. ఈ లక్షణాలను బట్టి ఆ పంటను బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు ఆశించినట్లుగా గుర్తించాలి. తెగులు లక్షణాలు గమనించిన వెంటనే పొలంలో నిలిచిన నీటిని 2-3 సార్లు మురుగు నీటి కాలువల ద్వారా బయటకు తీసివేసి కొత్త నీరు పెట్టడం వల్ల ఉధృతి తగ్గుతుంది. సిఫారసు చేసిన పొటాష్ ను మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో రెండు దఫాలుగా నాట్లువేసే సమయంలోనూ మరియు చిరుపొట్ట దశలోనూ వేయాలి. తెగులు సోకిన పొలానికి నత్రజని ఎరువుల వాడకాన్ని తగ్గించాలి.




డా. ఎం. గిరిజా రాణి


**ప్రధాన శాస్త్రవేత్త**

**ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం మార్టేరు, పశ్చిమగోదావరి,**

# చిరుధాన్యాలు :



**1. జొన్న:** పంట పూత దశలో ఉన్నప్పుడు వర్షాలు పడి వాతావరణంలో తేమశాతం ఎక్కువగా ఉంటే గింజ బూజు తెగులు లేదా బంక కారు తెగులు ఆశించడానికి వీలుంటుంది. వీటి నివారణకు ప్రొపికొనజోల్ మందును 0.5 మి.లీ/ లీటరు నీటికి కలిపి పూత దశలో, గింజ ఏర్పడే దశలో10 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.



**2. సజ్జ :** జూన్ నెలలో విత్తిన సజ్జ పంట కోత దశలో ఉంటుంది. గింజ గట్టిపడినప్పుడు కంకులను కోసి బాగా ఎండబెట్టి గింజలను నిల్వ చేసుకోవాలి. ఆలస్యంగా విత్తిన పంటలో తేనె బంక తెగులు నివారణకు బ్లైటాక్స్ 50% డబ్ల్యు.పి. 2.5 గ్రా.ల మందును లీటరు నీటిలో కలిపి పూత దశ నుండి వారం వ్యవధితో మూడు దఫాలుగా పిచికారీ చేయాలి.



**3. రాగి :** రాగి పంటలో అగ్గి తెగులు ఆశించవచ్చు. అగ్గితెగులును నివారించడానికి (మొక్క ఆకులపై/ కణుపుల పై వెన్నుపై మచ్చలు కనిపించినప్పుడు) లీటరు నీటికి 0.5 గ్రాముల ట్రైసైక్లోజోల్ 75% డబ్ల్యు.పి. లేదా 1 గ్రా. కార్బండిజమ్ మందును లీటరు నీటికి చొప్పున కలిపి మొక్కలపై పిచికారీ చేయాలి.



**4. కొర్ర :** కొర్ర పంటలో ఆకు మచ్చ తెగుళ్ళను నివారించడానికి లీటరు నీటికి 0.5 గ్రాముల ట్రైసైక్లోజోల్ లేదా 1 గ్రా. కార్బండిజమ్ 75% డబ్ల్యు.పి. మందును లీటరు నీటికి చొప్పున కలిపి మొక్కలపై పిచికారీ చేయాలి. కొర్ర పంటను ఖరీఫ్ కాలంలో సకాలంలో వర్షాలు లేనప్పుడు ప్రత్యామ్నాయ పంటగా సాగు చేయవచ్చు తక్కువ కాలపరిమితి గల సూర్యనంది, గరుడ వంటి రకాలను ప్రత్యామ్నాయ పంటగా లేదా అంతర పంటగా సాగు చేయడానికి అనుకూలం.




**డా. ఎల్. మాధవీలత**
ప్రధాన శాస్త్రవేత్త
వ్యవసాయ పరిశోధనా స్థానం,
రేకులకుంట.అనంతపురం


## మొక్కజొన్న



♦ రాష్ట్రంలో ఇప్పటివరకు సాధారణ వర్షపాతం నమోదయింది. పంట ఏ దశలో ఉన్నప్పటికీ, పంట పొలంలో అధికంగా చేరిన నీరును తీసి వేసుకోవాలి, తెగుళ్ళు వ్యాప్తిచెందకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యగా మాంకోజెబ్ పొడి మందును(2.5 గ్రా. / లీ. లేదా ప్రొపికొనజోల్ 200 మి.లీ. 200 లీ. నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. పంట శాఖీయ దశ నుండి పుష్పించే దశలో ప్రత్యేకంగా పై చర్యలతో పాటు మురుగు నీరును తీసివేసిన తరవాత పై పాటుగా యూరియా 20-25 కేజీలు మరియు పొటాష్ 15 కేజీలు ఎకరానికి (బూస్టర్ ఎరువుగా) వేసుకోవాలి.

♦ మోకాలి ఎత్తు దశ అనగా 30-35 రోజుల వయసున్న పైరులో అంతరకృషి జరిపి రెండవ దఫాగా 26 కేజీల నత్రజని ఇచ్చే ఎరువును పైపాటుగా వేసుకుని మట్టిని మొక్కల వేర్ల పైకి ఎగదోయాలి.

♦ 50-55 రోజుల వయసు ఉండి పూత దశలో ఉన్న పైరుకు మూడవ దఫాగా 26 కేజీల నత్రజని ఇచ్చే ఎరువుతో పాటు 10 కేజీల పొటాష్ ఎరువును వేసుకోవాలి. పూత దశలో ఉన్న పైరు నీటి ఎద్దడి లేక నీటి ముంపు పరిస్థితులకు గురి కాకుండా చూడాలి.

♦ కత్తెర పురుగు (ఫాల్ ఆర్మీ వార్మ్) గొంగళి పురుగు ఆకుల చివరల నుండి తింటూ ఆకు సుడులను, కాండాన్ని తొలిచి రంధ్రాలను చేసి పంటను నష్టపరుస్తుంది. నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 5% ఎస్.జి. మందును 0.4 గ్రా. లీటరు నీటికి లేదా స్పైనోసాడ్ 45% ఎస్.సి. 0.3 మి.లీ. లీటరు నీటికి లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 18.5% ఎస్.సి. 0.4మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి ఆకుల సుడులు బాగా తడిచేటట్లు పిచికారీ చేయాలి. అవసరాన్ని బట్టి పై మందులను పది రోజుల వ్యవధిలో మార్చి మార్చి పిచికారీ చేయాలి.

♦ ఆకుమాడు తెగులు ఆశించిన పైరుకు మాంకోజెబ్ 2.5 గ్రా. ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి. పాము పొడ తెగులు ఆశించిన పైరులో నేలకు దగ్గరగా ఉన్న ఒకటి లేదా రెండు తెగులు సోకిన ఆకులను తీసివేయాలి. ప్రొపికొనజోల్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.




**డా. ఐ. సుధీర్ కుమార్,**
సీనియర్ శాస్త్రవేత్త,
వ్యవసాయ పరిశోధనా స్థానం,
పెద్దాపురం
కాకినాడ.

# పత్తి గులాబీ రంగు పురుగు సమగ్ర సస్యరక్షణ

**పత్తిలో గులాబీ రంగు పురుగు ఎక్కువగా ఆశించి నష్ట పరచడానికి కారణాలు :**

- సంవత్సరం పొడవునా పత్తి సాగుచేయడం వలన పురుగుకు ఎప్పుడూ ఆహారం అందుబాటులో ఉండడం.
- పెద్ద ఎత్తున వివిధ కాలపరిమితి కలిగిన సంకర రకాలను సాగుచేయడం వలన పురుగుకు అన్ని వేళల ఆహారం లభిస్తుంది. పద్ధతి ప్రకారం నిఘా కార్యక్రమాలు పాటించకపోవడం.
- గూడ, పూత, లేత విత్తనాలలో బి టి. విషం తక్కువగా ఉండడం. పంట కాలాన్ని నవంబరు నుంచి డిసెంబరు తర్వాత కూడా పొడిగించడం. సమగ్ర సస్య రక్షణలు పాటించక పోవడం.
- బి.టి. పత్తి వచ్చిన తర్వాత పురుగు మందుల వాడకంలో వచ్చిన మార్పు గులాబీ రంగు పురుగు సంక్లిష్టమైన జీవిత చరిత్ర కలిగి ఉండడం.

## పత్తిలో ఎందుకు సమస్యాత్మకం :

పంటలో మొదటిగా తల్లి పురుగులు గుడ్లను మొగ్గ దగ్గర పెడతాయి.



పిల్ల పురుగులు (లార్వాలు) పుష్పం లోపలికి చేరి నష్టం కలుగ చేస్తాయి. గుడ్డి పూలు ఏర్పడతాయి. అందువలన మిత్ర పురుగుల బారిన పడకుండా ఉంటాయి. పురుగు మందులు పిచికారీ చేసినప్పటికీ వాటి ప్రభావం కూడా తక్కువగా ఉంటుంది. తరువాత కాయమీద రక్షక పత్రాల లోపలి వైపు, కాయలపై గుడ్లను పెడతాయి. గుడ్డు నుండి పొదిగిన పిల్లలు త్వరితగతిన లోనికి ప్రవేశిస్తాయి. కాయ లోపల దాగి ఉండి నష్టం కలిగిస్తాయి. అందువల్ల కేవలం పురుగుమందులను వాడి నివారించడం కష్టంతో కూడుకున్న పని.



పత్తి పంట లేనప్పుడు కొన్ని పురుగులు 6-8 నెలలు నిద్రావస్థలో ఉండి తరువాత కాలంలో వేసిన పత్తి పంటను ఆశిస్తాయి.

## నష్ట పరిచే విధానం :

గుడ్డు నుండి పొదిగిన వెంటనే పిల్ల పురుగు చాలా చిన్నదిగా ఉంటుంది. కంటికి కనబడదు. కాయల మీద సన్నటి రంధ్రాలు చేసి లోపలికి ప్రవేశిస్తుంది. రంధ్రాలు విసర్జితాలతో పూడుకు పోతాయి. కాయను వలచి చూస్తే లోపలి భాగంలో సొరంగాల మాదిరిగా చారలు కనబడతాయి. (కాయ గోడ లోపలి భాగంలో). అక్కడి మెత్తటి పదార్థాన్ని తింటాయి. తరువాత విత్తనాలను ఆశిస్తాయి. దూది రంగు మారుతుంది. ఎదుగుదల తగ్గిపోతుంది. కాయ కుళ్ళుతుంది. అపరిపక్వంగా పగులుతుంది. నిదానంగా రెండు నుండి మూడు లార్వాలు కాయను ఆశించి నష్టపరుస్తాయి. అందువల్ల నష్టం ఎక్కువగా ఉంటుంది. గులాబీ రంగు పురుగు కాయలను మాత్రమే ఆశించి నష్ట పరిచే పురుగు. అంతేకానీ ఆకులను, కొమ్మలను ఆశించదు. అప్పుడప్పుడు చిన్న లార్వాలు పువ్వులోని అండాశయాన్ని ఆశించి నష్టం కలుగచేస్తాయి. కానీ పువ్వులోనే పూర్తిగా ఎదగవు. తరువాత మరొక కాయను ఆశించి జీవిత చక్రాన్ని పూర్తి చేసుకుంటాయి.

**పురుగు ఆశించినప్పుడు లక్షణాలు :**

**రోజెట్టి పూలు :** పూలు పూర్తిగా విచ్చుకోవు. వంకర తిరిగి ఉంటాయి.




**పచ్చి కాయలమీద నల్లటి మచ్చలు :** పచ్చి కాయల మీద నల్లటి మచ్చలు గమనించినట్లైతే గులాబీ రంగు పురుగు ఆశించినటువంటి కాయలను తరువాత బ్యాక్టీరియా ఆశించడం వల్ల కాయ గోడ నల్లగా మారుతుంది.

పగిలిన కాయల్లో దూది రంగు మారుతుంది. గులాబీ రంగు పురుగు అశించిందని చెప్పడానికి ఇది ఒక ముఖ్యమైన లక్షణం. ఈ లక్షణాన్ని పురుగు ఆశించిన తరువాత పంట చివరి దశలో గమనించవచ్చు. లింగాకర్షక బుట్టల్లో తల్లి రెక్కల పురుగులు పడినప్పుడు పంటను పురుగు ఆశించి నష్టం కలుగ చేస్తోందని గుర్తించాలి. ఎందువలన అంటే ఇది ఒక పత్తి పంటను మాత్రమే ఆశించే పురుగు.



**సమగ్ర సస్య రక్షణ :**

- పంట కాలాన్ని పొడిగించకుండా డిసెంబర్ కల్లా పత్తి తీయడం ముగించాలి. కార్శి పంటగా పండించరాదు.
- పత్తి తీసిన వెంటనే పొలంలోనికి గొర్రెలను, మేకలను వదిలినట్లైతే గులాబీ రంగు పురుగు ఆశించిన గుడ్డి కాయలను తింటాయి. తరువాతి పంటపై పురుగు ఉధృతి తగ్గుతుంది.
- యంత్రాలను (ట్రాక్టర్‌తో నడిచే షెడ్డర్) ఉపయోగించి పత్తి కట్టెను చిన్న చిన్న ముక్కలుగా చేసి పొలంలో కలియదున్నాలి.
- పంట మార్పిడి చేయాలి. దీని వల్ల పురుగు జీవిత చక్రాలకు విరామం ఏర్పడుతుంది. సంతానోత్పత్తి ఆగిపోతుంది.
- పంట కాలంలోను, గోదాముల దగ్గర, జిన్నింగ్ మిల్లుల దగ్గర, మార్కెట్ యార్డ్‌లలో లింగాకర్షక బుట్టలను పెట్టి తల్లి రెక్కల పురుగులను ఆకర్షించాలి.
- ట్రైకోగ్రామా పరాన్నజీవులను 60,000 ఎకరాకు, పూత దశలో వారం రోజుల వ్యవధిలో మూడుసార్లు విడుదల చేయాలి.
- సామూహికంగా ఎక్కువ సంఖ్యలో లింగాకర్షక బుట్టల ద్వారా, ఆడ, మగ పురుగుల మధ్య సంపర్కం జరగకుండా అరికట్టాలి.
- ఆర్థిక సహన స్థాయి (రోజుకు 8 రెక్కల పురుగులు/ఒక బుట్టలో మూడు రోజులు వరసగా పడినట్లయితే) పాటిస్తూ పురుగు మందులను పిచికారీ చేయాలి.
- అవసరాన్ని బట్టి ప్రొఫెనోఫాస్ 50% ఇ.సి. ఎకరానికి 400 మి.లీ. (లేదా) థయోడికార్బ్ 75% డబ్ల్యు.పి. ఎకరానికి 300గ్రా లేదా క్వినాల్‌ఫాస్ 25% ఇ.సి. ఎకరానికి 400 మి.లీ. లేదా క్లోరిపైరిఫాస్ 20% ఇ.సి 500 మి.లీ. ఎకరానికి పిచికారీ చేసుకోవాలి. మందులను పది రోజుల వ్యవధిలో మార్చి మార్చి వాడుకోవాలి.
- పంట చివరి దశలో సింథటిక్ పైరిత్రాయిడ్ మందులైన సైపర్ మెత్రిన్ 25% ఇ.సి. ఎకరాకు 200మి.లీ. లేదా లామ్డా సైహలో త్రిన్ 5% ఇ.సి. ఎకరాకు 200 మి.లీ. ఒకటి లేదా రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి.
- పంట మొదటి దశలో ఎసిఫేట్ లాంటి మందులను వాడకూడదు. అలా చేయడం వల్ల రొట్ట ఎక్కువై పంటలో కాయలు త్వరగా ఏర్పడవు. ఈ మందులను పిచికారీ చేయనట్లైతే పంట ఒకేసారి పక్వానికి వస్తుంది. తద్వారా గులాబీ రంగు పురుగు బారి నుండి తప్పించుకోవచ్చు.



- పంట చివరి దశలో మాత్రమే సింథటిక్ పైరిత్రాయిడ్ మందులను పిచికారీ చేయాలి. లేదంటే పంట మీద తెల్లదోమ ఉధృతి పెరుగుతుంది.
- 150 రోజుల పంట కాలపరిమితిగల రకాలను అధిక సాంద్ర పద్ధతిలో సాగు చేయడం వల్ల గులాబీ రంగు పురుగు బారినుండి తప్పించుకోవచ్చు.
- జనవరి నుండి జూన్ నెల మొదటి వరకు పత్తి పంట లేకుండా చూసుకున్నట్లైతే పురుగు జీవిత చక్రం క్రమం తప్పుతుంది. తరువాతి పంట మీద పురుగు ఉధృతి తగ్గుతుంది.




**డా. జి.ఎం.వి. ప్రసాద రావు,**
**ప్రధానశాస్త్రవేత్త, ఐ.సి.సి. గన్నవరం.కృష్ణా.**

# శనగ సాగు

## నేల తయారీలో జాగ్రత్తలు



కేవలం రబీలో మాత్రమే సాగుకు అనుకూలమైన పప్పుజాతి పంట శనగ.

♦ మొక్కజొన్న, నీరు నిలవని వరి మాగాణుల్లో, పత్తి పంట తర్వాత ఈ పంటను ఎక్కువగా సాగు చేస్తారు.

♦ ప్రధానంగా ఈ పంటను ఏకపంటగా (లేదా) శనగ + ధనియాలు 16 :4 అంతరపంటగా సాగు చేస్తారు.

♦ సారవంతమైన మధ్యస్థ లేదా తేమను బాగా పట్టి ఉంచే నేలలు అత్యంత అనుకూలం.

♦ చౌడు నేలలు, మురుగు నీరు నిలిచే నేలలు పనికి రావు. ఖరీఫ్ పైరు కోత అనంతరం నేలను నాగలితో లేదా ట్రాక్టర్ కల్టివేటర్, రోటావేటర్‌తో మెత్తగా దున్ని, చదును చేసి విత్తుటకు సిద్ధం చేయాలి.

♦ సాధారణ రకాలు 90-110 రోజులు కాల పరిమితి, స్వల్పకాలిక రకాలు 80-90 రోజుల పంటకాలం కలిగి ఉంటాయి.

♦ ఈ పంట సాగుకు అక్టోబర్ నుండి నవంబర్ మొదటి పక్షం వరకు అత్యంత అనుకూలం.

చలి ఎక్కువ కాలం ఉండే ప్రాంతాలలో, అలాగే 1-2 పత్తి తీతల అనంతరం గులాబీ రంగు పురుగు నివారణ చర్యల్లో భాగంగా డిసెంబర్ మొదటి పక్షం వరకు కూడా ఈ పంట సాగు చేసుకునే అవకాశం ఉంది. కానీ సాధారణ దిగుబడిలో తగ్గుదల ఉంటుంది.

♦ చదరపు మీటరుకు 33 మొక్కలు దేశవాళీ రకాలలో, 22 మొక్కలు కాబూలీ రకాలలో ఉండేటట్లు మొక్కల సాంద్రతను చూసుకోవాలి.

విత్తిన వారం-పది రోజుల్లో తక్కువగా మొలక ఉన్న చోట ఖాళీలను విత్తుకోవాలి.

♦ విత్తుకునే ముందు కిలో విత్తనానికి కార్బాక్సిన్ + థైరం 1.5 గ్రా. లేదా కార్బండిజం 2.5 గ్రా. లేదా థైరం / కాప్టాన్ 3 గ్రా. కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి.

♦ వేరుపురుగు ఉధృతి ఉన్న ప్రాంతాలలో క్లోరిపైరిఫాస్ 20% ఇ.సి. ద్రావణం 6.5 మి.లీ కిలో విత్తనానికి కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి. శనగను మొదటిసారిగా పొలంలో సాగు చేసేటప్పుడు రైజోబియం కల్చర్‌ను విత్తనానికి పట్టించాలి. ఎకరం విత్తనానికి 750గ్రా. రైజోబియం కల్చర్‌ను వాడాలి. ఎండుతెగులు వచ్చే ప్రాంతాలలో, సమస్యాత్మక భూముల్లో జీవశిలీంద్ర నాశిని ట్రైకోడెర్మావిరిడి 8 గ్రా. కిలో విత్తనానికి పట్టించి విత్తుకోవాలి. లేదా నేల తయారీ సమయంలో ఎకరానికి 2-3 కిలోలు 100 కిలోలు బాగా చివికిన సేంద్రియ పదార్థంతో కలిపి చల్లుకోవాలి. మొదట శిలీంద్ర నాశిని మందుతో శుద్ధి చేసి, ఆర బెట్టిన తర్వాత జీవశిలీంద్ర నాశిని లేదా రైజోబియం కల్చరును విత్తనాలకు పట్టించాలి.

♦ సాళ్ళ పద్ధతిలో నాగలి లేదా గొర్రుతో విత్తుకోవాలి. విత్తనం 5-8 సెం.మీ. లోతులో పడేలా విత్తుకోవాలి. ట్రాక్టర్‌తో నడిచే విత్తనగొర్రు లేదా వెడల్పైన బోదెలు, కాలువల పద్ధతిలో కూడా విత్తుకోవచ్చు.

♦ సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతిలో భాగంగా చివరి దుక్కిలో ఎకరాకు 2 టన్నుల పశువుల ఎరువు వేసుకోవాలి.

♦ ఎకరాకు 750 గ్రా. రైజోబియం కల్చర్‌ను, 2 కిలోల ఫాస్ఫో బాక్టీరియాను, సేంద్రియ ఎరువుతో కలిపి కానీ లేదా విత్తనం విత్తేటప్పుడు కానీ సాళ్ళలో పడేటట్లు వేసుకోవాలి. దీని వలన ఫాస్ఫోబాక్టీరియా జీవన ఎరువు, భూమిలోని మొక్కలకు లభ్యం కాని రూపంలో ఉన్న భాస్వరాన్ని, సులభంగా అందుబాటులోకి తెచ్చి మొక్కకు చేరువ చేస్తుంది.

♦ సూటి ఎరువుల రూపంలో ఎకరాకు 18-20 కిలోల యూరియా, 325 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను వాడాలి. భాస్వరం ఎరువును సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ రూపంలో వేస్తే పంటకు గంధకం అందుతుంది.

♦ కాంప్లెక్స్ ఎరువుల రూపంలో వాడే రైతులు ఎకరాకు 50 కిలోల డి.ఏ.పి. 15 కిలోల పొటాషియం వాడాలి. ఎకరానికి 8-10 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరం, 8 కిలోల పొటాష్, 40 కిలోల గంధకం ఇచ్చే ఎరువులు వేయాలి.

♦ రసాయనిక ఎరువులను భూసార పరీక్ష ఫలితాల కార్డ్ విశ్లేషణల ఆధారంగా వాడుకోవాలి.

♦ శనగ సాగు చేసే ప్రాంతాలలో జింక్ ధాతు లోపం ఉంటే ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ ఆఖరు దుక్కిలో వేయాలి. లేదా పైరుపై లోప లక్షణాలు కనిపించినప్పుడు లీటరు నీటికి 2 గ్రా. జింక్ సల్ఫేట్ కలిపి పిచికారీ చేయాల్సి ఉంటుంది. కాబట్టి ముందస్తుగా నేల తయారీలోనే ఈ జాగ్రత్తలు తీసుకుంటే పెట్టుబడి ఖర్చులు ఆదా చేసుకునే అవకాశం ఉంది.

♦ పైరు విత్తిన 40 రోజుల వరకు కలుపు లేకుండా జాగ్రత్త పడాలి. సమగ్ర కలుపు యాజమాన్య పద్ధతులు పాటించాలి.

♦ మొలకెత్తక ముందు పెండిమిథాలిన్ 30% ఇ.సి. ఎకరాకు 1.25-1.5 లీటర్లు లేదా పెండిమిథాలిన్ 37.8% సి.ఎస్. 700 మి.లీ. లేదా ఆక్సీ ఫ్లోరోఫెన్ 100 మి.లీ. లేదా అల్లాక్లోర్ ఒక లీటరు లేదా మెటలాక్లోర్ ఒక లీటరు 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన 48 గంటలలోపు నేలపై పిచికారీ చేయాలి.

♦ 30-35 రోజుల దశలో గొర్రుతో అంతర కృషి చేసి కలుపును నివారించాలి.

♦ అంతర కృషి చేయలేని పక్షంలో పంట 20-25 రోజుల దశలో గడ్డి జాతి కలుపు నిర్మూలనకు ప్రొపాక్విజఫాప్ ఇథైల్ 10 ఇ.సి. 250 మి.లీ. లేదా క్విజలోఫాప్ ఇథైల్ 10% ఇ.సి. 400 మి. లీ. లేదా ఫెనాక్సాప్రాప్ ఇథైల్ 9% ఇ.సి. 200 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

♦ పూత దశకు ముందు (30-35 రోజులు ) ఒక సారి, గింజ గట్టిపడే దశలో (55-65 రోజులు) ఒక సారి నీటి తడులు ఇస్తే మంచి దిగుబడి వస్తుంది.

**100 గ్రాముల శనగల్లో పోషక విలువలు**

| పోషకం | రోజువారీ విలువ శాతం |
|---|---|
| సోడియం 24 మి.గ్రా. | 1% |
| పొటాషియం 875 మి.గ్రా. | 25% |
| కార్బోహైడ్రేట్లు61గ్రా. | 20% |
| పీచు పదార్ధం 17 గ్రా. | 68% |
| ప్రోటీన్ 19 గ్రా. | 38% |
| విటమిన్ సి. | 6% |
| ఐరన్ | 34% |
| విటమిన్ బి.6 | 25% |
| మెగ్నీషియం | 28% |
| కాల్షియం | 10% |

**(రోజు వారీ విలువల్లో హెచ్చు తగ్గులు ఉండవచ్చు)**



డా. పి. వి. రమేష్ బాబు, శాస్త్రవేత్త
డా. కె. లక్ష్మణ్, శాస్త్రవేత్త
వ్యవసాయ పరిశోధన స్థానం, రేకులకుంట, అనంతపురము



# రబీ కంది సాగు అవకాశాలు


కంది పంట ఆంధ్రప్రదేశ్ లో దాదాపు 2.46 లక్షల ఎకరాల్లో సాగవుతూ 1.2 లక్షల టన్నుల ఉత్పత్తినిస్తోంది. హెక్టారుకి 504 కిలోల సరాసరి దిగుబడినిస్తోంది. పత్తి, మిరప, పొగాకులకు ప్రత్యామ్నాయంగా అలాగే సజ్జ, జొన్న, మొక్కజొన్న, పెసర, సోయాచిక్కుడు, వేరుశనగ లాంటి పైర్లతో అంతర పంటగా కందిని ఖరీఫ్ లో పండించవచ్చు. నీటి వసతి ఉన్న ప్రాంతాలలో కందిని రబీలో కూడా పండించవచ్చు.



**విత్తే సమయం :** కృష్ణా, గోదావరి, దక్షిణ మండలం, ఉత్తర కోస్తా మండలాల్లో రబీ పంటగా సెప్టెంబరు-అక్టోబరు నెలల్లో విత్తుకోవచ్చు.



**నేలలు :** నీరు త్వరగా ఇంకిపోయే గరప, ఎర్ర రేగడి, చల్కా నేలల్లో, మురుగు నీరు పోయే వసతి గల నల్ల రేగడి నేలల్లో సాగు చేసుకోవచ్చు. చౌడు నేలలు, నీటి ముంపునకు గురయ్యే నేలలు పనికి రావు. భూమిని రెండు సార్లు నాగళ్ళతో దున్ని నేలను మెత్తగా తయారు చేయాలి.



**విత్తనశుద్ధి :** కిలో విత్తనానికి 8 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ లేదా 10 మి.లీ. థయోమిథాక్సామ్ కలిపి విత్తితే రసం పీల్చు పురుగుల నుండి పంటను 30-45 రోజులు రక్షించుకోవచ్చు. ఆఖరుగా ద్రవరూప రైజోబియంను కిలో విత్తనానికి 5-10 మి.లీ. కలిపి విత్తితే అధిక దిగుబడిని పొందవచ్చు.

**విత్తే పద్ధతి :** నాగలి వెంబడి గాని, సాళ్లలో గొర్రుతో గాని విత్తుకోవాలి. సీడ్ డ్రిల్ ఉపయోగించి విత్తుకోవచ్చు.

**విత్తే దూరం :** నల్లరేగడి నేలల్లో 150×20 లేదా 180×20 సెం.మీ. (వరుసల మధ్య, మొక్కల మధ్య), ఎర్ర నేలల్లో 90×20 సెం.మీ., వర్షాధారంగా 45-60×10, ఆరు తడి పంటగా 75-90×10 సెం.మీ.

**ఎరువులు :** చివరి దుక్కిలో ఎకరాకు 2 టన్నుల పశువుల ఎరువు, 16 కిలోల నత్రజని, 20 కిలోల చొప్పున భాస్వరం వేసుకోవాలి. అంతర పంటగా వేసినప్పుడు పైరును బట్టి వేసే




ఎరువు మోతాదు మారుతుంది. ప్రధాన పైరుకు అంతర పంటకు వేర్వేరుగా ఎరువులు వేయాలి.

**నీటి యాజమాన్యం :** వర్షాలు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో రబీ కందికి 2 తేలిక పాటి తడులు ఇవ్వాలి. ఈ తడులు మొగ్గ రాబోయే ముందు ఒకసారి, కాయ దశలో మరోసారి ఇవ్వాలి.

**కలుపు నివారణ, అంతరకృషి:** పెండిమిథాలిన్ 30% ఎకరాకు 1.0-1.5 లీటర్లు లేదా అలాక్లోర్ 50%ఎకరాకు లీటరు చొప్పున విత్తిన వెంటనే గాని మరుసటి రోజుగాని పిచికారీ చేయాలి. విత్తిన 30, 65 రోజులప్పుడు గుంటకతోగాని, గొర్రుతో గాని అంతరకృషి చేయాలి. విత్తిన 20-25 రోజుల మధ్య గడ్డి జాతి కలుపు మొక్కలైన ఊద, చిప్పెర, గరిక నివారణకు క్విజాలోఫాప్ ఇథైల్ 5% మందును 400 మి.లీ. ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి చల్లాలి. గడ్డిజాతి, వెడల్పాకు కలుపు మొక్కలు ఉంటే ఎకరానికి 300 మి.లీ. ఇమజితాఫిర్ 5% మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.



**అంతర పంటలు :** తక్కువ కాల పరిమితి గల మినుము, పెసర, తృణధాన్యాలు, వేరుశనగలను అంతర పంటలుగా వేసుకోవచ్చు. కంది + జొన్న/మొక్కజొన్న/సజ్జ పంటలను 1:2 నిష్పత్తిలోను, కంది + పెసర / మినుము / సోయాచిక్కుడు / వేరుశనగ పంటలను 1:7 నిష్పత్తిలో వేసుకోవచ్చు.



## రబీ కంది సాగుకి అవకాశాలు

కారణాంతరాల వల్ల తొలకరిలో ఏ పైరు వేసుకునేందుకు అవకాశం లేని ప్రాంతాలు. అధిక వర్షాలకు, బెట్టకు మొదటి పంట పూర్తిగా దెబ్బతిన్న ప్రాంతాలు. తొలకరిలో స్వల్పకాలిక పంటలు (పెసర, మినుము లాంటివి) వేసుకుని రెండవ పంటగా కంది వేసుకోవచ్చు. స్వల్పకాలిక వరి రకాల తర్వాత కూడా కందికి అవకాశముంది. అయితే అక్టోబర్ తర్వాత కంది విత్తకూడదు. తొలకరి కంది ఎక్కువ ఎత్తు పెరగటం వలన ఈ పంటను ఆశించే కాయ తొలుచు పురుగు. మారుకా మచ్చల పురుగుల నివారణ కష్టమవుతుంది. రబీ కంది, అనువైన ఎత్తులో ఉండటం వలన సస్యరక్షణ చర్యలు చేపట్టటం తేలిక. రబీ కంది జనవరిలో పూతకొస్తుంది. ఈ సమయంలో శనగపచ్చ పురుగు వ్యాప్తి తక్కువగా ఉంటుంది. కాబట్టి పురుగును తట్టుకుంటుంది.

**రబీ కందికి అనువైన ప్రాంతాలు :** దక్షిణ కోస్తా జిల్లాలైన నెల్లూరు, ప్రకాశం. నాగార్జునసాగర్ ఆయకట్టు ప్రాంతాల్లో కూడా కందిని ఆరు తడి పంటగా పండించవచ్చు. నీటి వసతి ఉంటే మన రాష్ట్రంలో ఏ ప్రాంతంలోనైనా సాగు చేయవచ్చు.

తొలకరిలో 170 నుండి 180 రోజుల్లో కోతకు వచ్చే మధ్యకాలిక రకాలైన ఎల్.ఆర్.జి. 105, ఎల్.ఆర్.జి. 33 (సౌభాగ్య), అభయ, ఎల్.ఆర్.జి. 52 లను రబీ కాలంలో కూడా వేసుకోవచ్చు.

**పంటకోత - నిల్వ :** కాయలు ఎండిన తర్వాతనే కంది పంటను కోసి కట్టెతో కొట్టి కాయల నుండి గింజలను వేరు చేయాలి. నిల్వ చేసేటప్పుడు పురుగులు ఆశించకుండా ఉండేందుకు బాగా ఎండ బెట్టి, బూడిద కాని, వేప ఆకులు గాని కలపాలి.



డా. యం.శివ,

డా.జి.రమేష్,


శాస్త్రవేత్త, శాస్త్రవేత్త,
కృషివిజ్ఞాన కేంద్రం, దర్శి.
ప్రకాశం.

# వేరుశనగ తెగుళ్లు నివారణ



వేరుశనగ లో ఆశించే చీడలు, సమగ్ర యాజమాన్యం

**టిక్కా ఆకుమచ్చ తెగులు:** త్వరగా వచ్చే ఆకుమచ్చ తెగలు పంట వేసిన 30 రోజుల నుండి కనిపిస్తుంది. ఈ మచ్చలు కొంచెం గుండ్రంగా ఉండి ఆకు పైభాగాన ముదురు గోధుమ రంగుతో ఉంటాయి. ఆలస్యంగా వచ్చే ఆకు మచ్చ తెగులు మచ్చలు చిన్నవిగా,



గుండ్రంగా ఉండి ఆకు నల్లని రంగు కలిగి ఉంటాయి. కాండం మీద, ఆకు కాడల మీద, ఊడల మీద కూడా మచ్చలు ఏర్పడతాయి.

**నివారణ:** తెగులు నివారణకు తట్టుకునే రకాలైన కదిరి హరి తాంధ్ర, అభయ, కదిరి అమరావతి & కదిరి లేపాక్షిలను సాగుచేయాలి. తెగులు కనిపించిన వెంటనే ఎకరాకు మాంకోజెబ్ 400 గ్రా. కార్బండిజమ్ 200 గ్రా. లేదా క్లోరోథలోనిల్ లేదా హెక్సాకొనజోల్ 400 మి.లీ. లేదా టెబ్యుకొనజోల్ 200 మి.లీ చొప్పన కలిపి ఒకసారి తరువాత 15 రోజులకు మరొక్కసారి పిచికారీ చేయాలి.

**మొదలు కుళ్ళు తెగులు:** ఈ తెగులు ఆశించిన విత్తనాలు మొలక రాకుండానే భూమిలో కుళ్ళిపోతాయి, విత్తనం మొలకెత్తిన తరువాత మొదలు నేలమట్టంపై ఉన్న కాండం పైన మచ్చలు ఏర్పడి నల్లని శిలీంధ్ర బీజాలతో కప్పబడి ఉంటుంది. ఈ తెగులు క్రమంగా పైకొమ్మలకు వ్యాపిస్తుంది. కాయలపై కూడా శిలీంధ్రం ఆశించి నల్లని మచ్చలను కలుగజేస్తుంది. తెగులు తీవ్రం అయితే మొక్కలు వడిలిపోయి ఎండిపోతాయి.



**నివారణ :** విత్తే ముందు కిలో విత్తనానికి 1 గ్రా. టెబ్యుకొనజోల్ 2 డి. యస్ లేక 3 గ్రా. మాంకోజెబ్ చొప్పున కలిపి విత్తన శుద్ధి చేయాలి. విత్తనాన్ని 5 సెం.మీ కంటే లోతుగా వేయకూడదు.

పప్పు శనగ పంటతో పంట మార్పిడి చేయాలి. తెగులు ఆశించిన వెంటనే ఎకరాకు 400గ్రా. మాంకోజెబ్ మందుని పిచికారీ చేయాలి.


**కాండం కుళ్ళు తెగులు:** ఈ తెగులును బూజు తెగులు లేక బుడిమ తెగులు కూడా అంటారు. ఈ తెగులును కలుగచేసే



శిలీంద్రం భూమి ద్వారా, విత్తనం ద్వారా వ్యాపిస్తుంది. తెగులు ప్రారంభ దశలో మొక్క మొదలలో ఉన్న శాఖలు పసుపు వర్ణానికి మారి ఎండిపోతాయి. తరువాత భూమిపై ఉన్న కాండం మీద తెల్లటి బూజు తెరలుగా ఏర్పడుతుంది. ఈ తెల్లటి బూజులో ఆవగింజ పరిమాణంలో ఉన్న శిలీంద్ర సిద్ధ బీజాలు ఏర్పడతాయి. కాయలోని గింజలపై నీలి బూడిద రంగు మచ్చలు ఏర్పడతాయి.

**నివారణ :** సజ్జ, జొన్న వంటి పంటలతో పంట మార్పిడి చేయాలి. 2 కిలోల ట్రైకోడెర్మా విరిడిని 90 కిలోల పశువుల ఎరువు, 10 కిలోల వేపపిండితో కలిపి వృద్ధి చేసిన మిశ్రమాన్ని ఆఖరు దుక్కిలో వేసుకోవాలి. కిలో విత్తనానికి 3 గ్రా మాంకోజెబ్ లేదా 1గ్రా టెబ్యుకొనజోల్ కలిపి విత్తన శుద్ధి చేయాలి. తెగులు సోకిన మొక్కల చుట్టూ 2 మి.లీ హెక్సాకొనజోల్ 1 లీ నీటిని కలిపి తడిచేటట్లు పిచికారీ చేయాలి.

**తుప్పు లేక కుంకుమ తెగులు:** ఆకుల అడుగు భాగంలో ఎరుపు లేక ఇటుక రంగు గల చిన్న పొక్కులు ఏర్పడి ఆకు పైభాగంలో పసుపు రంగు మచ్చలు కన్పిస్తాయి. తెగులు ఎక్కువైనపుడు ఈ పొక్కులు పూల మీద తప్ప మొక్క మిగతా అన్ని భాగాల మీద కన్పిస్తాయి.



**నివారణ:** ఎకరాకు 400 గ్రాముల క్లోరోథలోనిల్ లేదా 400గ్రా. మాంకోజెబ్ (లేదా) 400మి.లీ. హెక్సాకొనజోల్ (లేదా) 200మి.లీ. టెబ్యుకొనజోల్ 200 లీటర్ల నీటిలో కలిపి మొక్కలు తడిచే విధంగా పిచికారీ చేయాలి.

**మొవ్వు కుళ్లు వైరస్ తెగులు (పి.బి.ఎన్.డి.):** ఈ తెగులు లక్షణాలు మొదటగా లేత ఆకులపై నిర్జీవ వలయాలు లేక చారలు కనిపించి, మొవ్వు ఎండిపోతుంది. ఆకులు చిన్నవిగా మారి లేత



ఆకుపచ్చని మచ్చలు కలిగి పాలిపోయి ఉంటాయి. లేత దశలో ఆశించిన మొక్కలలో కాయలు ఏర్పడవు. ముదిరిన మొక్కలలో తెగులు లక్షణాలు కొన్ని కొమ్మలలో మాత్రమే కన్పిస్తాయి. తెగులు సోకిన మొక్కల నుండి వచ్చిన వేరుశనగ కాయ, విత్తనాలు చిన్నవిగా ఉండి, ముడుచుకొని ఉంటాయి.

**నివారణ:** కిలో విత్తనానికి 2 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ 600 ఎఫ్.ఎస్. అనే మందును 4 మి.లీ. నీటితో కలిపి విత్తనశుద్ధి చేసిన తర్వాత 1 గ్రాము టెబ్యుకొనజోల్ లేదా 3 గ్రాముల మాంకోజెబ్ లేదా 2 గ్రా. మాంకోజెబ్ 50% + కార్బండిజమ్ 25% డబ్ల్యు.ఎస్. అనే పొడి మందుతో కూడా శుద్ధి చేసి తరువాత విత్తుకోవాలి. విత్తిన 20 రోజుల తరువాత తామర పురుగులను అరికట్టడానికి మోనోక్రోటోఫాస్ 320మి.లీ. లేదా డైమిథోయేట్ 400 మి.లీ. లేక 80 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ ను 200 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరాకు పిచికారీ చేయాలి.






డా.ఇ.శిరీష, విషయనిపుణులు
డా.సి.రాధా కుమారి, సమన్వయ కర్త
కృషి విజ్ఞాన కేంద్రం, కళ్యాణదుర్గం, అనంతపురం.



# చెరకును ఆశించు రసం పీల్చు పురుగులు నివారణ చర్యలు

చెరకును ఆశించు రసం పీల్చు పురుగుల వలన సుమారు 40-55 శాతం వరకు కూడా దిగుబడులు తగ్గే అవకాశం ఉంది. రసం పీల్చు పురుగులలో ప్రధానంగా పొలుసు పురుగు, దూదేకుల పురుగు, తెల్ల దోమ, పిండినల్లి, నల్లి, పేను బంక, తామర పురుగులు చెరకును ఆశించి నష్టపరుస్తాయి.

**పొలుసు పురుగు :**



- చెరకు కణుపులు ఏర్పడిన దశ నుండి నాటే దశ వరకు ఈ పురుగు ఆశిస్తుంది.
- ఈ పురుగు ఆశించిన తొలి దశలో ఆకుల చివర్లు పాలిపోయి ఎండిపోతాయి. తదుపరి మొక్కలు ఎదుగుదల ఆగి కణుపుల విస్తరణ క్రమేపి తగ్గిపోతుంది.
- ఈ పురుగు అధికంగా ఉన్నపుడు చెరకు గెడలు, కణుపులపై గోధుమ రంగులో మందంగా పొలుసు (పెంకు) ఏర్పడుతుంది.

**నివారణ చర్యలు :**

**రసాయనేతర పద్ధతులు**

- పొలుసు పురుగు ఆశించని తోటల నుంచి విత్తనపు దవ్వను/కణుపులను సేకరించాలి.
- నిరంతర కార్శి తోటలు సాగును తప్పించాలి.
- మొవ్వులో కేవలం 8 ఆకులు ఉంచి కింద ఎండుటాకులను రెలచుట వలన వ్యాప్తి తగ్గుతుంది.

**రసాయన పద్ధతులు**

- మూడు కళ్ళ ముచ్చెలు నాటేముందు డైమిథోయేట్ 2మి.లీ లేదా ఇమిడాక్లోప్రిడ్ 600 ఎఫ్.ఎస్. 1మి.లీ లీటరు నీటికి మందు ద్రావణంలో 15 నిముషాలు పాటు ముంచి నాటుకోవాలి.
- కింది ఎండుటాకులు రెలచిన పిమ్మట పొలుసు పురుగు నివారణకు జులై, ఆగస్టు మాసాలలో డైమిథోయేట్ 1.0 మి.లీ. లేక ఎసిఫేట్ 1 గ్రా లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.
- అధిక వర్షాలు పడినప్పుడు డైమిథోయేట్ రసాయనం మెరుగుగా ఉంటుంది.

**దూదేకుల పురుగు (పైరిల్లా)**

- ఈ పురుగు చెరకు మొక్కల సాంద్రత అధికంగా ఉండడం, ఎక్కువ ఎరువులు వాడుట వలన ఉద్రుతి పెరుగుతుంది.
- వాతావరణంలో తేమశాతం అధికంగా (75-80%) ఉండుట, ఉష్ణోగ్రతలు 23-30$^{0}$C చేరిన చోట ఈ పురుగు ఆశిస్తుంది.
- మబ్బులతో కూడిన వాతావరణం ఉన్నప్పుడు ఈ పురుగు ఉధృతి ఎక్కువవుతుంది.



- ఈ పురుగు చెరకు ఆకుల అడుగు భాగాన్ని ఆశించి కణ ద్రవాన్ని పీల్చటం వలన ఆకులు పసుపు రంగులోకి మారి తదుపరి ఎండిపోతాయి.

**నివారణ చర్యలు :**

- ఎరువుల వాడకంలో సమతుల్యత పాటించాలి.
- తోట పడిపోకుండా సకాలంలో కట్టుడు కట్టాలి
- పురుగుల గుడ్ల సముదాయాలను గమనించిన వెంటనే నాశనం చేయాలి.

**జీవ నియంత్రణ పద్ధతులు:**

- కోశస్థ దశ పురుగులు 1-2 లక్షల గుడ్లు ఎకరానికి చొప్పున విడుదల చేస్తే మంచి నివారణ సాధ్య పడుతుంది. టెట్రాస్టికాస్ పైరిల్లా అనే గుడ్ల పరాన్నజీవి గుడ్లు 2 లక్షలు / ఎకరాకు చొప్పున విడుదల చేస్తే దూదేకుల పురుగును గుడ్ల దశలో నివారించవచ్చును.
- ఈ పురుగు నిర్ణీత ఉధృతి స్థాయి (3-5 పురుగులు ఒక ఆకుకు) దాటిన తదుపరి మాత్రమే రసాయన చర్యలు చేపట్టాలి.



- క్లోరిపైరిపాస్ 2.5 మి.లీ లేదా డైమిథో యేట్ 1.6 మి.లీ లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ లీటరు నీటికి కలిపి ఆకుల అడుగు భాగం బాగా తడిచేటట్లు పిచికారీ చేయాలి.

**తెల్ల దోమ :**

- ఈ పురుగు నీరు నిల్వ ఉండే చోట, అధిక నత్రజని ఎరువులు వాడేచోట, వర్షాభావ పరిస్థితుల్లో, సరైన యాజమాన్యం పాటించని తోటల్లో ముఖ్యంగా కార్శి తోటల్లో అక్టోబర్ వరకు ఉధృతి ఎక్కువగా ఉంటుంది.
- తల్లి పురుగులు, పిల్ల పురుగులు ఆకుల అడుగు భాగం నుండి రసాన్ని పీల్చుట వలన ఆకులు తొలుత పసుపు రంగులోకి మారి తదుపరి నారింజ రంగుకు మారి ఎండిపోతాయి.
- తెల్లదోమ ఆశించిన చెరకు గడలతో తయారు చేసిన బెల్లం నల్లగా, మెత్తగా ఉండటమే గాక నిల్వ కూడా ఉండదు.

**నివారణ చర్యలు :**

- ఎరువులు వాడకంలో సమతుల్యత పాటించాలి.
- మురుగు నీటి పారుదల సౌకర్యం కలిగి ఉండాలి.
- లోతట్టు ప్రాంతంలో చెరకు పంటను కార్శి చేయకూడదు
- ఈ పురుగు నివారణకు క్లోరిపైరిపాస్ 2.5 మి.లీ లేదా డైమిథోయేట్ 1.6 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ లీటరు నీటికి కలిపి ఆకుల అడుగు భాగం బాగా తడిచేటట్లు పిచికారీ చేయాలి.


**పిండి నల్లి :**



- అనుకూల ఉష్ణోగ్రతలతో పాటు నీటి ఎద్దడికి గురైన తోటలలో ఈ పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది.
- తల్లి పురుగులు, పిల్ల పురుగులు ఆకు తొడిమలకు, చెరకు కణుపులకు మధ్య గుంపులుగా పెరిగి గెడల నుండి రసాన్ని పీలుస్తాయి.
- ఈ పురుగు విసర్జించే తేనెలాంటి జిగురు పదార్ధం మీద మసివలె తెగులు వచ్చి చెరకు కణుపుల నల్లబడతాయి.

**నివారణ చర్యలు:**

- చెరకు పంటను నరికిన తర్వాత చెరకు చెత్తను తగులబెట్టాలి.
- పిండి నల్లి ఆశించని చెరకు విత్తనపు దవ్వను నాటాలి.
- విత్తనపు దవ్వను నాటడానికి ముందు డైమిథోయేట్ 2 మి.లీ లీటరు నీటికి కలిపిన ద్రావణంలో 15 నిమిషాలు ఉంచి శుద్ధి చేసుకోవాలి.



- ఉధృతి అధికంగా ఉన్న చోట కింది ఆకులను రెలచి డైమిథోయేట్ 1.7 మి లీ లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

**తామర పురుగులు :**

- ఈ పురుగులు 30-60 రోజుల వయస్సు కలిగిన చెరకు తోటల్లో, వేసవిలో (మార్చి-మే) ఆశిస్తుంది.
- వర్షాభావ పరిస్థితుల్లో ఎక్కువ ఉంటుంది.
- తల్లి, పిల్ల పురుగులు మొవ్వులో లేత ఆకుల పై ఆశించి రసం పీల్చటం వలన చెరకు ఆకుల కొనలు సూది మొనల వలె చుట్టు కొనిపోయి, క్రమేపి పై నుండి క్రిందకు ఎండిపోతాయి.

**నివారణ చర్యలు :**

- క్లోరిపైరిఫాస్ 2.5 మి. లీ లేదా డైమిథోయేట్ 1.7 మి.లీ. లేక మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.



డా. డి సుధారాణి,
సీనియర్ శాస్త్రవేత్త,
చెరకు పరిశోధనా స్థానం, ఉయ్యూరు
కృష్ణా



# ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యకరమైన వరి సాగుకు ఆచరణీయ పద్ధతులు

మన రైతులు పండిస్తున్న వివిధ పంటల్లో వరి ప్రధాన ఆహార పంట. రాష్ట్రంలో అధిక శాతం ప్రజలకు జీవనోపాధి అందిస్తోంది. కాబట్టి తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడి సాధించాల్సిన అవసరం ఎంతో ఉంది. ఇందులో భాగంగా రైతులు కొంతమంది రసాయన రహిత వ్యవసాయం చేస్తూ ప్రకృతిలో సహజంగా లభించే వాటిని పంట సస్యరక్షణలో ఉపయోగిస్తూ వరి పంటలో ఆరోగ్యవంతమైన దిగుబడులు సాధిస్తున్నారు. ఆ పద్ధతులను మనమూ తెలుసుకుని ఆచరిద్దాం. ముందుగా 5లీటర్ల బీజామృతంతో 25-30 కిలోల విత్తనాలను విత్తనశుద్ధి, నారు శుద్ధి చేయాలి. నీటిపారుదల గల వరి సాగు పరిస్థితుల్లో సాలు పద్ధతి, డ్రమ్ సీడర్ పద్ధతి, సిస్టం ఆఫ్రైస్ ఇంటెన్సిఫికేషన్ (శ్రీ) పద్ధతి, వర్షాధార వరిసాగులో డైరెక్ట్ సీడింగ్ (వెదజల్లే పద్ధతి) ను ప్రోత్సహించాలి.

**ఘనజీవామృతం:** 1) ఎకరానికి 1000-1500 కిలోల టైప్-2 ఘనజీవామృతం చివరి దుక్కిలో / దమ్ములో వేయాలి 2) టైప్-1 ఘనజీవామృతం 400 కిలోల / ఎకరానికి, రెండు సమాన భాగాల్లో నాటిన 20 రోజులకు, 40 రోజులకు, 20 రోజుల వ్యవధిలో వేయాలి.

**ద్రవజీవామృతం: 1)నేలపై జల్లడం:** ఎకరానికి 800 లీటర్లను, నాలుగుసార్లు, అనగా నాటిన 35,50,65,80 రోజులకు జల్లాలి. ప్రతిసారి 200 లీటర్లు చొప్పున వాడాలి.

**2)పంటపై పిచికారీ:** ఎకరానికి 400 లీటర్లను, నాలుగుసార్లు, ప్రతిసారి ద్రవ జీవామృతం స్ప్రే చేసినప్పుడు 100 లీటర్ల నీటిలో 50 లీటర్ల ద్రవజీవామృతంతోకలిపి పిచికారీ చేయాలి. అనగా నాటిన 25, 45, 55, 70 రోజులకు పిచికారీ చేయాలి. ప్రతిసారి పిచికారీకి 200 లీ. వాడాలి.

**అజోల్లా:** నాటిన ఏడు రోజుల తరువాత, 10-15 కిలోల అజోల్లాను ప్రతి ఎకరానికి వేసుకోవాలి. అజోల్లా నత్రజనిని స్థిరీకరిస్తుంది, కలుపు తగ్గిస్తుంది, సేంద్రియ పదార్థంగా ఉపయోగపడుతుంది.

**రాజీలేని సూత్రాలు:**

కొసలు తుంచి నాటడం, కాలిబాటలు-ప్రతి 2 మీకు 30 సెం.మీ. కాలిబాటలు తియ్యాలి, సరిహద్దు/గట్లు పైన/ పెరిఫెరల్ ప్లాంటేషన్ - బంతి / కంది / మొక్కజొన్న / కూరగాయలు గ్లైరిసిడియా / సెస్బేనియా, ఎకరానికి 10-15 జిగురు పూసిన పసుపు పళ్లాలు వాడాలి.

కాండం తొలుచు పురుగు నివారణకు, ఎకరానికి 8 లింగాకర్షక బుట్టలు పెట్టాలి, ఎకరానికి 10-15 పక్షిస్థావరాలు. పైన తెలిపిన రాజీలేని సూత్రాలు అన్నీ పాటించాలి.

**మొక్క పెరుగుదలకు ఉపయోగపడే ద్రావణాలు:** 1). పంచగవ్య- ఎకరాకి 4లీటర్లు, పిలకలు పెట్టే దశలో ఒకసారి పిచికారీ చేయాలి 2) కోడిగుడ్డు నిమ్మరసం ద్రావణం-250 మి.లీ/ చేపబెల్లం ద్రావణాన్ని 100 లీటర్లు నీటిలో కలిపి, వెన్ను దశలో ఒకసారి పిచికారీ చేయాలి 2) సప్త ధాన్యాంకుర టానిక్-100 లీటర్ల నీటిలో 700 గ్రా సప్త ధాన్యంకుర మొలకెత్తిన రుబ్బిన విత్తనాల పిండిని కలిపి రెండు సార్లు వాడాలి (నాణ్యత, దిగుబడి, పరిమాణం రెండింటినీ పెంచడానికి) ఒకసారి గింజ పాలు పోసు కునే దశలో రెండవ సారి గింజ గట్టిపడే దశలో పిచికారీ చేయాలి.

వరి పంటలో వివిధ పంటకాల పరిస్థితులలో 365 రోజులు హరితహారం (365 DGC) చేయడానికి సూచనలు

**కాలువద్వారా (డెల్టా):** i) పి.ఏం.డి.ఎస్ – ఖరీఫ్ వరి – రబీ డ్రై సోయింగ్ (RDS) – రబీ వరి

**బోరు బావులు, మెట్ట పరిస్థితులు:** a) పి.ఏం.డి.ఎస్– ఖరీఫ్ వరి–రబీ డ్రై సోయింగ్ (RDS) – రబీ వరి b) పి.ఏం.డి.ఎస్– ఖరీఫ్ వరి – రబీ డ్రై సోయింగ్ (RDS) – రబీలో పప్పుజాతి పంటలు / ఇతర పంటలు.

బోరు బావుల ద్వారా సాగు చేసే పరిస్థితుల్లో ఖరీఫ్ సర్దుబాటు చేయడం ద్వారా, వరి పంట అక్టోబర్ చివరి నాటికి లేదా నవంబర్ 1వ పక్షం నాటికి పూర్తయ్యేటట్లు చేసి, ఆపై రబీ డ్రై సోయింగ్ పద్ధతిని పాటించాలి. రబీ డ్రై సోయింగ్ పంటలను 25–35 రోజుల వరకు పెంచడం ద్వారా నేలలో కలియ దున్నడానికి వీలవుతుంది.

| పురుగు / తెగుళ్ళు | రాజీలేని సూత్రాలు | యాజమాన్య పద్ధతులు |
|---|---|---|
| కాండం తొలిచే పురుగు | కొసలు తుంచి నాట్లు వేయాలి, ట్రైకోగామా గుడ్డు పరాన్నజీవులను ట్రైకో కార్డుల రూపంలో వరి ఆకుల చివర్లలో కుట్టి విడుదల చేయడం. పురుగు, తెగుళ్ళ వృద్ధి తెలుసుకోవడానికి, ఎకరానికి 8 లింగాకర్షక బుట్టలు పెట్టాలి. | 5%వేప గింజల కషాయం (100 లీటర్ల నీటిలోకి 5 కిలోల వేపగింజలు) లేదా నీమాస్త్రం పిచికారీ చేయాలి. 2.3 లీటర్ల అగ్నాస్త్రం 100 లీటర్ల నీటిలో కలిపి పిలకలు పెట్టె దశలో, చిరుపొట్ట దశలో పిచికారీ చేయాలి. |
| ఆకుముడత పురుగు | మెలితిరిగిన తాడుని వరి పంటపై లాగడం వలన ఆకుముడతలోఉన్నపురుగులు,ఎండపడడం వలన నీటిలో పడి చనిపోతాయి. వాడే కషాయాలు పురుగు పడడం వలన తొందరగా చనిపోతాయి. | 5%వేప గింజల కషాయం (100 లీటర్ల నీటిలోకి 5 కిలోల వేపగింజలు) లేదా నీమాస్త్రం పిచికారీ చేయాలి. |
| ఉల్లికోడు | – | 5 లీటర్లు అగ్నాస్త్రంను 200 లీటర్లు నీటికి కలిపి పిచికారీ చేయాలి. |
| సుడిదోమ | ప్రతి 2 మీటర్లుకి 30 సె. మీ.ల కాలి బాటలు తీయాలి. ఎకరానికి 20–25 జిగురు పూసిన పసుపు/ తెలుపుపళ్ళాలు పెట్టుకోవాలి | 5–6 లీటర్లు తూటికాడ కషాయం, కుంకుడు కాయల రసాన్ని 100 లీటర్లు నీటిలో కలిపి వరి దుబ్బుల మొదలి బాగంలో పిచికారీ చేయాలి. |
| ఆకుపచ్చ దీపపు పురుగు | ఎకరానికి 20–25 జిగురు పూసిన పసుపు / తెలుపు పళ్ళాలు పెట్టుకోవాలి. | 5 లీటర్లు వావిలాకు కషాయం 100 లీటర్లు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. |
| ఆకునల్లి | – | 5 లీటర్లు పేడ అమృతం ఇంగువ ద్రావణం 100 లీటర్లు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. |
| ప్రధాన తెగుళ్ళు | | |
| పాముపొడ తెగులు | సరైన నీటి యాజమాన్య పద్ధతులు పాటించడం (పొలంలో అధిక నీటిని ఉంచకూడదు). | 6 లీటర్లు పేడ అమృతం ఇంగువ ద్రావణం 100 లీటర్లు నీటిలో కలిపి పిచికారీ చేయాలి లేదా 6 లీటర్లు పుల్లటి మజ్జిగ 100 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి |
| కాండం కుళ్ళు తెగులు లేదా దుబ్బుకుళ్ళు తెగులు | పొలంలో ఎక్కువ నీరు నిల్వకుండా చూసుకోవాలి. నీడ పడే ప్రాంతంలో వరి నాట్లు నాటకూడదు. | బీజామృతంతో విత్తన నారు శుద్ధి చేయాలి. 6 లీటర్లు శొంటి పాల కషాయాన్ని 100 లీటర్లు నీటికి కలిపి పిచికారీ చేయాలి. 6 లీటర్లు పేడ అమృతం ఇంగువ ద్రావణం 100 లీటర్లు నీటిలో కలిపి పిచికారీ చేయాలి |

# రైతులు ప్రకృతి వ్యవసాయం పై దృష్టి సారించాలి




వర్క్ షాప్ లో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీ రావు

వ్యవసాయ శాఖ, ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటి నాచురల్ ఫార్మింగ్ (APCNF) సమన్వయంతో పనిచేసి రానున్న ఐదేళ్ళలో రాష్ట్రంలోని 30 లక్షల హెక్టార్ల బీడు భూములను సాగులోకి తీసుకురావాలని వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ కోరారు. ప్రతి పార్లమెంట్ నియోజక వర్గంలో పది వేల ఎకరాలను ప్రకృతి వ్యవసాయంలోకి తీసుకు రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించినట్లు తెలిపారు. **"ప్రకృతి వ్యవసాయంలో అనుసరిస్తున్న ఉత్తమ వ్యవసాయ పద్ధతులను సంప్రదాయ వ్యవసాయంలో సమీకృతం చేసి రాష్ట్ర వ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాలనే"** ఉద్దేశంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ తాడేపల్లి లో ప్రకృతి వ్యవసాయంపై వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్.డిల్లీరావు అధ్యక్షతన రెండు రోజులపాటు వర్క్ షాప్ నిర్వహించింది. ఈ వర్క్ షాప్ లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి జిల్లా వ్యవసాయ అధికారులు, ఏ.పీ.సీ.ఎన్.ఎఫ్. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజశేఖర్ మాట్లాడుతూ ప్రపంచ దేశాలు ప్రకృతి వ్యవ సాయం వైపు చూస్తున్నాయని, వాతావరణంలో వచ్చే విపరీత మార్పులను అధిగమించాలంటే ప్రకృతి వ్యవసాయమే శరణ్యమని సూచించారు. సుస్థిర వ్యవసాయానికి ఇతర ప్రత్యామ్నాయ మార్గాలు లేని కారణంగా ప్రకృతి వ్యవసాయం వెనుక ఉన్న శాస్త్రీయతను అందరు గుర్తించాలని సూచించారు. రసాయన వ్యవసాయం వల్ల రైతులకు ఆదాయం రాకపోగా, సన్న, చిన్నకారు రైతులు బలవన్మర ణాలకు పాల్పడుతున్నారని అన్నారు. మన రాష్ట్రంలో 30 లక్షల హెక్టార్ల బీడు భూములు ఉన్నాయని, రానున్న ఇదేళ్ళలో బీడు భూములన్నింటినీ సాగులోకి తీసుకువచ్చేందుకు ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ విజయ్ కుమార్ మాట్లాడుతూ రైతుల ఆదాయం, ఆనందం తోపాటు, ప్రజల ఆరోగ్యం, భూమాత సంరక్షణ ప్రకృతి వ్యవసాయం మీదనే ఆధారపడి ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల రైతులకు అయిదు రెట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉందని అన్నారు. అదే లక్ష్యంగా ముందుకు నడవాలని సూచించారు. 45 దేశాల నుంచి రాష్ట్రానికి వచ్చిన ప్రతినిధుల బృందాలు ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను పరిశీలించి అధ్యయనం చేశాయని చెప్పారు.

ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు బృందాలుగా విడిపోయి జిల్లాల వారీగా ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాల అమలుపై ప్రణాళికలు రూపొందించారు. వ్యవసాయ శాఖతో సమన్వయమై ప్రకృతి వ్యవసాయాన్ని, అందులో ఉన్న సైన్స్ ను సంపూర్ణంగా అర్థం చేసుకొనేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని స్థాయిల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలను నిర్వహించే అంశంపై చర్చించారు. ఈ పంట, ప్రకృతి వ్యవసాయ రైతుల నమోదుపై ప్రతిపాదనలు తయారు చేయడం, జోన్ల వారీగా ఏ గ్రేడ్, ఏ టీ ఎం, డ్రాట్ ప్రూఫ్ మోడల్, 365 రోజుల పాటు పచ్చదనం తదితర ఉత్తమ వ్యవసాయ పద్ధతులను విస్తరించడం, వరి పంటలో ఏ గ్రేడ్ పద్ధతులను అనుసరించడం, రాయలసీమ, దక్షిణ కోస్తా జిల్లాలలో బీడు భూములను సాగులోకి తెచ్చేందుకు ప్రత్యేక ప్రణాళికలను రచించడం తదితర అంశాలపై బృంద చర్చలు నిర్వహించారు. అనంతరం జిల్లాల వారీగా ప్రకృతి వ్యవసాయం అమలుచేసే విధానాలను ప్రజెంటేషన్ల ద్వారా వివరించారు.

వి.ఎ.ఎ.లు ప్రతి మంగళ, బుధవారాల్లో జరిగే పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం గురించి రైతులకు అవగాహన కల్పించి బీడుభూములలో డ్రాట్ ప్రూఫింగ్ మోడల్, ఎ గ్రేడ్, ఎ.టి.ఎం. నమూనాలు అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో రైతు సేవ కేంద్రాల ద్వారా ప్రకృతి వ్యవసాయం చేసే రైతులను ఈపంట లో నమోదు చేయించాలని సూచించారు. వ్యవసాయ శాఖ ప్రతేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతి వి.ఎ.ఎ రైతులు ప్రకృతి వ్యవసాయ మోడల్స్ వేయించే విధంగా శిక్షణ ఇవ్వాలన్నారు. రానున్న రోజులలో ప్రతి నియోజకవర్గానికి ఇద్దరు మోడల్ మేకర్స్‌తో మోడళ్ళు వేయించ డానికి కృషి చేస్తామని చెప్పారు.

# చిత్రమాలిక






**పంటల బీమా– రైతుకు ధీమా...** పంటల బీమా విధి విధానాలపై మంత్రివర్గ ఉపసంఘం కసరత్తు, ఉన్నతాధికారుల చర్చ





**బాధితులకు అండగా..** గోదావరి జిల్లాల్లోని వరద ప్రాంతాల్లో సహాయ చర్యలపై అధికారులకు సూచనలిస్తున్న మంత్రి



**ప్రణాళికకు తుది రూపు..** వ్యవసాయ శాఖ వార్షిక ప్రణాళికపై ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్, డైరక్టర్ డిల్లీ రావు, ఉద్యానశాఖ కమీషనర్ శ్రీధర్ సమాలోచన



**సరికొత్తగా ఈ పంట..** ఈ పంట పోర్టల్, యాప్ విడుదల చేస్తున్న డైరక్టర్ డిల్లీ రావు



# మిరప సాగు యాజమాన్య పద్ధతులు

వాణిజ్యపరంగా పండించే పంటలలో మిరప పంట ప్రధానమైనది. ఆంధ్రప్రదేశ్‌లో మిరప 1.8 లక్షల హెక్టార్లలో సాగవుతూ 8.36 లక్షల టన్నుల ఉత్పత్తితో దేశంలోనే అత్యధిక ఉత్పాదకతతో ప్రథమ స్థానంలో ఉంది. అందువలన మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడంలో మెలకువలు తెలుసుకొందాం.

## ప్రధాన పొలం తయారీ:

- పొలాన్ని వేసవిలో బాగా లోతుగా దున్ని నేల లోపలి పొరల్లో సూర్యరశ్మి సోకినట్లు చేసినట్లయితే వేరు పురుగులు వంటి చీడపీడల ఉధృతి తగ్గుతుంది.
- తొలకరి మొదలైనప్పుడు జనుము పిల్లి పెసర, అలసందలు వంటి పచ్చిరొట్ట పైర్లు పెంచి అవి పూత దశకు చేరినప్పుడు భూమిలో బాగా కలియదున్నితే భూసారం పెరిగి, నేల గుల్లబారి చౌడు తగ్గి భాస్వరం వినియోగం పెరుగుతుంది. మిరప మొక్కలు దృఢంగా పెరుగుతాయి. ఎకరానికి 10 నుంచి12 కిలోల పచ్చిరొట్ట విత్తనాన్ని ఇసుకతో కలిపి పొలం అంతా చల్లుకోవాలి. పచ్చిరొట్ట చివికిన తర్వాత నేలను బాగా దున్ని



ఆఖరు దుక్కిలో ఎకరానికి 10 టన్నుల పశువుల ఎరువు 10 కిలోల వేప పిండికి రెండు కిలోల ట్రైకోడెర్మా శిలీంద్రపు పొడిని కలిపి 12-15 రోజుల నీడలో ఉంచి శిలీంద్రం వృద్ధి చెందిన తర్వాత భూమిలో కలియ దున్నాలి. మొక్కదశలో నేల ద్వారా ఆశించి తెగుళ్లను నివారించుకోవచ్చు.

## ప్రధాన పొలంలో మొక్కలు నాటడం

- ముందుగా పొలాన్ని 3-4 సార్లు దుక్కి దున్ని రెండుసార్లు గుంటక తోలాలి. ఆరు వారాల వయసు గల మొక్కలు నాటుకోవాలి. నారుని పది లీటర్ల నీటికి ఐదు మిల్లీలీటర్లు ఇమిడా క్లోప్రిడ్ + 10 గ్రాముల కార్బండిజం కలిపిన మందులో ఐదు నిమిషాలు ముంచి నాటుకోవాలి. నాట్లు వేసేటప్పుడు వేరు మడత పడకుండా పాదులలో నాటుకోవాలి. మొక్క చుట్టూ మట్టిని అదిమినట్లయితే నేలలోని గాలి బయటకు నెట్టబడుతుంది. సూటి రకాలైతే పాదుకు రెండు మొక్కలు సంకర రకాలైతే పాదుకు ఒక మొక్క చొప్పున నాటాలి.



జులై-ఆగస్టుల్లో విత్తిన నారు సెప్టెంబరు- అక్టోబరుల్లో నాటుకోవడానికి అనుకూలంగా ఉంటుంది.

- వరుసల మధ్య 75 సెం.మీ. మొక్కల మధ్య 45 సెం.మీ. దూరం ఉండునట్లు మొక్కలు నాటుకోవాలి.

**ఎరువుల యాజమాన్యం:** • ఎకరానికి 10 టన్నుల చివికిన పశువుల ఎరువు, 150 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 200 కిలోల వేప పిండి వేసి ఆఖరి దుక్కిలో కలియదున్నాలి. ఎకరానికి 120 కిలోల నత్రజని 24 కిలోల భాస్వరం 45 కిలోల పొటాష్ (ఎరువుల రూపంలో 260 కిలోల యూరియా 150 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 80 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్) వేసుకోవాలి. మొత్తం భాస్వరం ఎరువును ఆఖరి దుక్కిలో వేసేయాలి. నత్రజని పొటాష్ ఎరువులను తక్కువ మోతాదులో ఎక్కువ దఫాలుగా వేయాలి.




- 90 కిలోల పశువుల ఎరువు 10 కిలోల వేప పిండి రెండు కిలోల ట్రైకోడెర్మా శిలీంద్రపు పొడిని కలిపి 12-15 రోజులు నీడలో ఉంచి శిలీంద్రం వృద్ధి చెందిన తరువాత భూమిలో కలియ దున్నితే మొక్క తొలిదశలో నేల ద్వారా ఆశించే తెగుళ్లను నివారించవచ్చు.

- యూరియాను వేప పిండితో కలిపి వేస్తే నత్రజని వినియోగ సామర్థ్యం పెరగడమే కాకుండా మొక్కలకు చీడపీడల నుండి రక్షణ లభిస్తుంది. అవసరమైన దానికంటే అధికంగా భాస్వరం వేయడం వల్ల అది నేలలో స్థిరీకరించబడుతుంది. దీనివలన మొక్కకు ఇతర సూక్ష్మ పోషకాలు అందక ఈ పోషక లోపాలు ఏర్పడటమే కాకుండా మొక్కల రోగ నిరోధక శక్తి తగ్గడం తాలుకాయలు ఏర్పడడం వంటి పరిణామాలు ఎదురవుతాయి.

**నీటి యాజమాన్యం:**

- మిరప పంటకు తేమ అధికమైనప్పుడు పూతరాలడంతోపాటు పంటను తెగుళ్ల ఆశించి దిగుబడులు తగ్గుతాయి.

- నల్లరేగడి మూడు వారాలకు ఒకసారి తేలిక నేలల్లో 10-15 రోజులకొకసారి వేసవి పంటకైతే 5-6 రోజులకు ఒకసారి నీటి తడులివ్వాలి.

- వర్షాలు అధికమై పంట ముంపునకు గురైనప్పుడు వెంటనే మురుగు నీటిని బయటికి పంపించాలి. వెంటనే రెండు శాతం యూరియా ద్రావణాన్ని లీటరు నీటికి 2 గ్రా. 3 రోజుల వ్యవధిలో 2-3 సార్లు పంటపై పిచికారీ చేయాలి. లీటరు నీటికి 5గ్రా. మెగ్నీషియం సల్ఫేట్ తో పాటు 5గ్రా. సూక్ష్మపోషక మిశ్రమాన్ని పిచికారీ చేయాలి. రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువగా ఉన్నప్పుడు నీటి తడులు తగ్గించాలి.

- వర్షాభావ పరిస్థితులలో పంట బెట్టకు గురైనప్పుడు మొక్కల పెరుగుదలకు 2శాతం యూరియా (లీటరు నీటికి 20 గ్రా.) + పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని (లీటరు నీటికి 3.5గ్రా.) పంటపై పిచికారీ చేయాలి.

**కలుపు నివారణ :**

- 10-15 రోజుల తరువాత గొర్రుతో లేదా పండ్ల దంతితో ఎద సేద్యం చేయాలి. దీనివలన కలుపు తగ్గుతుంది.

- విత్తనం నాటిన రెండు రోజులలోపు నేలలో తేమ ఉన్నప్పుడు లీటరు నీటికి 3 మి.లీ. చొప్పున పెండిమిథాలిన్ పిచికారీ చేసి కలుపు నివారించాలి.

- విత్తిన లేదా నాటిన 25-30 రోజుల నుండి 15-20 రోజుల వ్యవధిలో అవసరాన్ని బట్టి 2-3 సార్లు గుంటకతో అంతర కృషి చేసి కలుపు నివారించాలి.

- అంతరకృషి చేయడం వీలుకాని పక్షంలో పంట వరసల మధ్యనున్న కలుపు మొక్కలపై క్విజలోఫాప్ ఇథైల్ ను ఎకరానికి 400 మి.లీ. (2 మి.లీ./లీటరు నీటికి) చొప్పున పిచికారీ చేసినట్లైతే తుంగ, తిప్పతీగ మిగిలిన గడ్డి జాతి మొక్కలన్నీ రాకుండా ఉంటాయి.

**పూత రాలుట-నివారణ చర్యలు**

- మిరపలో 30-40 శాతం మాత్రమే కాయలుగా మారి మిగిలిన పూత సహజంగానే రాలిపోతుంది. అయితే నేలలో తేమ అధికమైనప్పుడు ఆకాశం మేఘావృతమై ఉన్నపుడు, పంట బెట్టకు గురైనప్పుడు పూత అధికంగా రాలిపోతుంది. పూత పిందె రాలుట ను తగ్గించి, పూతను అధికం చేయడానికి పంటపై నాఫ్థలిన్ ఎసిటిక్ యాసిడ్ (ఎన్.ఎ.ఎ)ను మొక్కలు నాటిన 40, 60, 80 వ రోజుల్లో పిచికారీ చేయాలి. ఈ నాఫ్థలిన్ ఎసిటిక్ ఆమ్లాన్ని 4.5 లీటర్ల నీటికి 1 మి.లీ. చొప్పున పిచికారీ చేసుకోవాలి.



డా.జె.ఫణి కుమార్, శాస్త్రవేత్త
డా.ఎ.రాధిక రమ్య, శాస్త్రవేత్త
ఉద్యాన పరిశోధనా స్థానం, లాం, గుంటూరు.



# ఎరువుల ఆదా.... మేలైన దిగుబడికి అధిక సాంద్రతతో బత్తాయి సాగు

చీని(బత్తాయి) తోటలు 95 వేల హెక్టార్లలో సాగవుతూ దేశంలోనే ఆంధ్ర ప్రధమ స్థానంలో ఉంది. మన రాష్ట్రంలో సాగయ్యే బత్తాయి రకం సాత్ గుడి. సాంప్రదాయ పద్ధతిలో బత్తాయి సాగు చేపట్టినప్పుడు మొక్కల మధ్య 6×6 మీ. దూరం పాటించాలి. ఈ పద్ధతిలో ఎకరాకు 110 మొక్కలు, హెక్టార్‌కు 277 మొక్కలు అవసరమవుతాయి. ప్రస్తుత పరిస్థితిలో తోటల సాగుకు లభ్యమయ్యే భూమి విస్తీర్ణం, వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తోటల ఉత్పాదకతను పెంచడానికి అధిక సాంద్ర పద్ధతిని పరిగణలోకి తీసుకొని పరిశోధనలు చేయడం జరిగింది. డా.వై.ఎస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం, చీని నిమ్మ పరిశోధనా స్థానం, తిరుపతి శాస్త్రవేత్తలు అఖిల భారత సమన్వయ ఫల పరిశో ధనా పథకం కింద అధిక సాంద్రత పద్ధతులు, ఎరువుల యాజమాన్యంపై చేసిన పరిశోధనల్లో మూడు రకాల మొక్కల మధ్య దూరంతో పాటు (6×6మీ., 6×5మీ., 6×4మీ.) మూడు విధానాల నత్రజని ఎరువుల యాజమాన్యంలో వీటి తీరు మొత్తంగా 9 రకాల పద్ధతుల్లో ప్రయోగాలు చేయడం జరిగింది.

నాణ్యమైన పశువుల ఎరువులో 0.5 శాతం నత్రజనితో పాటు 0.2 శాతం భాస్వరం, 0.5 శాతం పొటాష్ పోషకాలు ఉంటాయి. అదేవిధంగా వర్మీ కంపోస్ట్‌లో 1.6 శాతం నత్రజనితో పాటు 0.7 శాతం భాస్వరం, 0.8 శాతం పొటాష్ పోషకాలు ఉంటాయి. ఈ ప్రయోగంలో వీటినన్నిటినీ పరిగణలోకి తీసుకొని పోషకాల మోతాదును మినహాయించి, భాస్వరం, పొటాష్ ఎరువుల మోతాదును లెక్కించి వాటిని సింగల్ సూపర్ ఫాస్ఫేట్, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువుల రూపంలో చెట్లకు అందజేశాం.

బత్తాయి చెట్లకు కాపు కాసే సమయంలో (5 సంవత్సరాలు నుండి ) చెట్టుకు 1500 గ్రాముల నత్రజని, 350 గ్రాముల భాస్వరం, 400 గ్రాముల పొటాష్ పోషకాలు అవసరం. వీటితో పాటు సూక్ష్మ పోషకాలను సంవత్సరంలో కనీసం 4 సార్లు ఆకులపై పిచికారీ చేయాలి. ప్రాంతాన్ని బట్టి పూతకు వదిలే సమయం, కాయ దిగుబడి ఆధారపడి ఉంటాయి. ప్రధాన పంటగా బత్తాయిని అంగం పంటగా (ఆగస్ట్) అత్యధికంగా, వేసవి పంటగా (ఏప్రిల్ నుంచి మే నెలలు ) నూ సంవత్సరానికి రెండుసార్లు మంచి దిగుబడులు పొంద వచ్చు.

గత 12 సంవత్సరాలుగా పరిశోధనా ఫలితాల ఆధారంగా అధిక సాంద్ర పద్ధతిలో ఎరువుల యాజమాన్యంపై వెల్లడైన ఫలితాలను పరిగణలోకి తీసుకున్నప్పుడు మొక్కల మధ్య 6×4మీ. (416 మొక్కలు / హెక్టార్ కి ) పాటించి 25

శాతం నత్రజని ఎరువును పశువుల ఎరువు రూపం లో 75 కిలోలు చెట్టుకు అందించి, 1125 గ్రాముల నత్రజనిని యూరియా రూపంలో (2.45 కిలోలు), 200 గ్రాముల భాస్వరం పోషకాన్ని 1.25 కిలోల సింగల్ సూపర్ ఫాస్ఫేట్ రూపంలో, 25 గ్రాముల పొటాష్ ఎరువును 45 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో అందించినప్పుడు అధిక పండ్ల దిగుబడితో పాటు (44.6కిలోలు చెట్టుకు 300 కాయలు) 42.85 శాతం భాస్వరం ఎరువును, 93.75 శాతం పొటాష్ ఎరువును ఆదా చేసి, అధిక నికర ఆదాయం పొందినట్లు నిరూపణ అయ్యింది. అనగా అధిక సాంద్రత పద్ధతిలో (6 × 4 మీ.) ఎకరాకు కనీసం 157 కిలోల దుక్కి ఎరువును, 103 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులు ఆదా చేయవచ్చు.

| వరుస సంఖ్య | విషయం | సాధారణ పద్ధతి | అధిక సాంద్ర పద్ధతి |
|---|---|---|---|
| 1. | మొక్కల మధ్య దూరం | 6 × 6 మీ. | 6 × 4 మీ. |
| 2. | మొక్కల సంఖ్య | 277 మొక్కలు/హెక్టార్ కి | 416 మొక్కలు / హెక్టార్ కి . |
| 3. | ఎరువుల మోతాదు. | ( సంవత్సరం / చెట్టుకి )<br>1500 గ్రాముల నత్రజని<br>3.260 కిలోల యూరియా<br>350 గ్రాముల భాస్వరం<br>(2.20 కిలోల S.S.P)<br>400 గ్రాముల పొటాష్<br>(667 గ్రాముల ఎం.ఓ.పి.) | 1125 గ్రాముల నత్రజని<br>(2.45 కిలోల యూరియా) +<br>200 గ్రాముల భాస్వరం<br>(1.25 కిలోల ఎస్.ఎస్.పి.) +<br>25 గ్రాముల పొటాష్<br>(45 గ్రాముల ఎం.ఓ.పి.) +<br>(75 కిలోల పశువుల ఎరువు) |
| 4. | కాయ దిగుబడి | 44.26 కిలోలు/చెట్టుకి.<br>298 కాయలు/ చెట్టుకి.<br>12.26 టన్నులు హెక్టార్‌కి. | 44.62 కిలోలు.<br>300 కాయలు.<br>18.56 టన్నులు / హెక్టార్‌కి. |
| 5. | ఎరువుల ఆదా<br>ఎ) భాస్వరం<br>బి) పొటాష్ | | 42.85 శాతం<br>93.75 శాతం |





డా.ఎల్. ముకుందలక్ష్మి
ప్రధాన శాస్త్రవేత్త


డా.ఆర్. నాగరాజు
శాస్త్రవేత్త

చీనీ, నిమ్మ పరిశోధనా స్థానం, తిరుపతి.

# త్రివేణి సంగమం

# వెలగ పండు



నిజానికి వెలగ పండులో మనకు తెలియని ఔషధ గుణాలెన్నో ఉన్నాయి. వెలగ ఆకులు, బెరడు, పండ్లు అనేక ఔషధ గుణాలు కలిగి ఉన్నాయి. పండ్లలో ఫ్రూట్ యాసిడ్లు, విటమిన్లు, లవణాలు ఉంటాయి. ఆకులలో టానిన్లు, ఆవిరి అయ్యే నూనె ఉంటాయి. ఆకు రసం వాంతులను అరికట్టడానికి, బెరడు విష పురుగుల కాటు ప్రభావం తగ్గించడానికి, పండు జీర్ణశక్తిని పెంచడానికి ఉపయోగ పడతాయి. ఆకులు అజీర్ణం, కడుపు ఉబ్బరం, రక్త విరేచనాలు, మూలశంక నివారణకు, విషానికి విరుగుడుగా, స్కర్వీ వ్యాధి నివారణలో కూడా ఉపయోగ పడుతుంది.

**వెలగపండుతో వీటిని చేసి చూద్దాం :**



**వెలగపండు భేల్ : కావలసినవి :** వెలగపండ్లు 4, పచ్చిమిర్చి 10, (మిక్సీలో వేసి మెత్తగా చేయాలి.) ఉప్పు తగినంత, పంచదార 4 టీ స్పూన్లు, కొత్తిమీర తరుగు- 2 టేబుల్ స్పూన్లు, చాట్ మసాల 1 టీ స్పూన్, స్వీట్ చట్నీ అర టీ స్పూన్, గ్రీన్ చట్నీ ఒక టీస్పూన్.

**తయారీ :** వెలగ పండ్ల గుజ్జును ఒక పాత్రలో తీసుకొని, గరిటెతో బాగా మెదపాలి. పచ్చిమిర్చి ముద్ద, ఉప్పు, పంచదార, కొత్తిమీర తరుగు, చాట్ మసాల, గ్రీన్ చట్నీ, స్వీట్ చట్నీ జత చేసి, పప్పు గుత్తితో బాగా మెదపాలి. పగలకొట్టిన వెలగపండు చెక్కలలోనే అమర్చి అందిస్తే, చూడడానికి అందంగా ఉంటుంది.

**వెలగపండు స్మూతి : కావలసినవి :** వెలగ పండు 1, తేనె 2 టేబుల్ స్పూన్లు, ఓట్స్ ఒక టేబుల్ స్పూన్, పెరుగు-అరకప్పు, తాజా కొబ్బరి తురుము ఒక టేబుల్ స్పూన్, యాలుకల పొడి పావు టీ స్పూన్, మిరియాల పొడి పావు టీ స్పూన్, బెల్లం పొడి 1 టేబుల్ స్పూన్.

**గార్నిషింగ్ కోసం :** దానిమ్మ గింజలు ఒక టీ స్పూన్, మామిడి కాయ ముక్కలు ఒక టీ స్పూన్, జీడిపప్పు ముక్కలు ఒక టీ స్పూన్.

**తయారీ :** ఓట్స్ ను తియ్యటి నీళ్ళలో (లేదా) ఏదైనా పండ్ల రసంలో పది నిమిషాలు నానబెట్టాలి. వెలగ పండు గుజ్జు బయటకు తీసి, రెండు కప్పుల నీళ్ళలో సుమారు అరగంట సేపు నాన బెట్టాలి. మెత్తగా పిసికి, పీచు, గింజలను వేరు చేయాలి. మిక్సీలో వెలగపండు గుజ్జు, తేనె, ఐస్ క్యూబ్స్, బెల్లం పొడి, కొబ్బరి తురుము, నాన బెట్టిన ఓట్స్, యాలుకల పొడి, వేసి మెత్తగా చేయాలి. గ్లాసులలో పోసి, కొద్ది సేపు ఫ్రిజ్‌లో ఉంచి, చల్లగా అయ్యాక బయటకు తీసి, జీడి పప్పు ముక్కలు, దానిమ్మ గింజలు, మామిడి కాయ ముక్కలతో అలంకరించి అందించాలి.




**వెలగపండు షర్బత్: కావలసినవి :** వెలగపండు1, నీళ్ళు తగినన్ని, పంచదార తగినంత.

**తయారీ :** ముందుగా వెలగపండు గుజ్జును ఒక పాత్రలోకి తీసుకోవాలి. చేతితో మెత్తగా మెదిపి, తగినన్ని నీళ్ళు జత చేసి, చేతితో బాగా కలపాలి. ఒక పాత్రలోకి వడ పోయాలి. తగినంత పంచదార జత చేసి, బాగా కలియబెట్టాలి. ఫ్రిజ్‌లో గంట సేపు ఉంచి, బయటకు తీసి చల్లగా తాగాలి. ఎండ బాధ నుండి కాపాడుతుంది.



**వెలగ పండు జామ్ :కావలసినవి :** వెలగపండ్లు 4, వేడి నీళ్ళు పావులీటరు, పంచదార 200 గ్రాములు.

**తయారీ :** వెలగపండ్ల గుజ్జును ఒక పాత్రలో వేసి, మెత్తగా మెదపాలి. వేడి నీళ్ళు జత చేస్తూ బాగా కలియబెట్టాక, వడ పోసి, గింజలను వేరు చేయాలి. స్టవ్ మీద బాణలి వేడయ్యాక గుజ్జును అందులో వేసి బాగా కలపాలి. పంచదార జత చేసి, బాగా కలియ బెట్టి పొంగు వచ్చేవరకు ఉడికించాలి. పావు గంట తర్వాత మిశ్రమం కొద్దిగా చిక్క బడుతుంది.





**వెలగ పండు పచ్చడి : కావలసినవి :** వెలగ పండు 1, బెల్లం పొడి–1కప్పు, కారం–1 టేబుల్ స్పూన్, ధనియాల పొడి 1 టేబుల్ స్పూన్, వేయించిన జీలకర్ర పొడి 1 టేబుల్ స్పూన్, ఉప్పు–తగినంత, కొత్తిమీర 2 టేబుల్ స్పూన్లు.

**తయారీ :** వెలగ పండు గుజ్జును ఒక పాత్రలోకి తీసుకోవాలి. మిక్సీలో అన్ని పదార్థాలు వేసి మెత్తగా చేయాలి. ఈ పచ్చడిని ఫ్రిజ్ లో ఉంచితే పది రోజుల వరకు బాగుంటుంది.

### ఇవీ ఆరోగ్య ప్రయోజనాలు

100 గ్రాముల వెలగపండు గుజ్జు నుంచి 140 కాలరీలు వస్తాయి. అనేక వ్యాధుల నివారణలో ఔషధంగా పని చేస్తుంది.

★ వాంతులు, విరేచనాలు, జ్వరం, మలబద్దకం వంటి వ్యాధులకు ఈ పండు మంచి మందు.

★ అల్సర్‌తో బాధపడేవారికి ఈ పండు వల్ల ఉపశమనం కలుగుతుంది. వెలగపండు గుజ్జుతో చేసిన జ్యూస్ 50 మి.గ్రా. తీసుకొని గోరువెచ్చని నీళ్ళతో కలిపి తాగితే రక్త శుద్ధి అవుతుంది.

★ రక్తహీనతను నివారించే గుణం వెలగ పండులో ఉంది.

★ అలసటగా, నీరసంగా ఉన్నప్పుడు వెలగపండు గుజ్జులో కాస్త బెల్లం కలిపి తింటే శక్తి వస్తుంది.

★ మూత్ర పిండాల్లో రాళ్ళు తొలగిపోతాయి. వెలగపండు గుజ్జుకి తగినంత గోరువెచ్చని నీళ్ళు, కొద్దిగా పంచదార కలిపి తీసుకుంటే, రక్తంలో పేరుకున్న వ్యర్థాలు తొలగిపోతాయి. కాలేయం, కిడ్నీలపై అధిక పనిభారం పడకుండా ఉంటుంది.



డా.కె.భాగ్యలక్ష్మి,
ప్రోగ్రాం కో-ఆర్డినేటర్,
కృషి విజ్ఞాన కేంద్రం,
ఆముదాలవలస
శ్రీకాకుళం




# తామర పురుగులు సస్యరక్షణ

వివిధ రకాల పంట మొక్కలపై ముఖ్యంగా లేత ఆకులు, పూత, కాయలు, పండ్ల నుంచి రసాన్ని పీల్చి నష్టాన్ని కలుగచేసే, రసం పీల్చు పురుగులలో తామర పురుగులు ముఖ్యమైనవి. ఇవి 1-2 మి .మీ. పొడవుండి చురుకుగా మొక్క వివిధ భాగాలపై, అసంఖ్యాకంగా చేరి, గోకి రసాన్ని పీల్చడం వలన వక్క రంగులో చర్మం బీటలు వారి గార లాంటి గరుకు మచ్చలు ఏర్పడి, పూలు, కాయ, పండ్ల నాణ్యత తగ్గి మార్కెట్‌లో విలువ పడిపోతుంది. మామిడి, చీని, నిమ్మ, దానిమ్మ, ఉసిరి, కోకో, చింత, మిరప, ఉల్లి, గులాబి, చామంతి, బంతి, జేర్బెరాలలో తామర పురుగుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. జీడిమామిడిలో వర్షాకాలంలో ఇవి ఎక్కువగా ఉంటాయి.

## తామర పురుగు జీవిత చరిత్ర :



పిల్ల, పెద్ద పురుగులు లేత పసుపు రంగులో చీలిన రెక్కలతో 1 నుంచి 2 మి.మీ. పరిమాణంలో ఉండి మొక్కల లేత భాగాలలో కణజాలాన్ని చీల్చి ఆడ పురుగు గుడ్లను సుమారు 80-100 వరకు కణ జాలంలో చొప్పించి పెడ తాయి సాధారణంగా 4-5 వారాలలో జీవిత చక్రాన్ని పూర్తి చేసుకుంటాయి. కాని వీటికి అధిక వేడి, బెట్ట పరిస్థితులు ఎక్కువ అనుకూలంగా ఉంటాయి. అధిక సంతానోత్పత్తి జరిగి ఉధృతి పెరుగుతుంది.

## తామర పురుగుల వల్ల పంటలపై కలిగే నష్టాలు :





- పిల్ల, పెద్ద పురుగులు మొక్క లేత ఆకులు, కొమ్మలు, పూలు, కాయలను ఆశించి, గోకి రసం పీలుస్తాయి.
- ఆకులపై ముడతలు, వంకర ముడతలు ఏర్పడి, కొమ్మలు గుల్ల బారడం, మొక్కల ఎదుగుదల ఆగడం, పూత రాలడం వలన దిగుబడి తగ్గుతుంది. కాయలపై వక్క, ఇటుక రంగు మచ్చలు ఏర్పడి, నాణ్యత తగ్గి, మార్కెట్ లో విలువ పడిపోయి నష్టం ఎక్కువగా ఉంటుంది.
- ఈ పురుగులు నేరుగా రసం పీల్చి నష్టం కలిగించడమే కాకుండా, కొన్ని రకాల వ్యాధుల వ్యాప్తికి వాహకాలుగా ఉండి రైతులకు ప్రత్యక్షం గా, పరోక్షంగా ఆర్థిక నష్టం కలుగజేస్తాయి.

## తామర పురుగుల పెరుగుదలకు కారణాలు

♦ సిఫారసు చేసిన మోతాదులో నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులను అందించకపోవడం లేదా అధిక మోతాదులో అందించడం, ముఖ్యంగా నత్రజని ఎరువును మోతాదును మించి అందించడం వల్ల ఇవి గణనీయంగా పెరిగే అవకాశాలు ఉంటాయి.

♦ పొలం గట్లపై ఉండే కలుపు మొక్కలైన వయ్యారి భామ, ఉత్తరేణి, తుత్తురు బెండ వంటి వాటిని సకాలంలో నిర్మూలించక పోవడం వలన తామర పురుగులు వాటిపై ఆశ్రయం పొంది, పంట మొక్కలపై ఆశిస్తాయి.

♦ వాతావరణంలో వస్తున్న గణనీయమైన మార్పుల వల్ల వేడి వాతావరణ పరిస్థితులు ఏర్పడి, నీటి ఎద్దడి వల్ల వీటి వ్యాప్తి అధికంగా ఉంటుంది.

♦ పురుగు మందుల పిచికారీ సమయంలో ఆకుల అడుగు భాగంలో, పూత లోపల తడవక పోవడం వల్ల వీటి వ్యాప్తి, ఉధృతి పెరిగే అవకాశాలు చాలా ఉంటాయి.

♦ విచక్షణా రహితంగా పురుగు మందులను, సింథటిక్ పైరిత్రాయిడ్ మందులతో కలిపి వాడడం, సిఫారసు లేని బయో మందులను వాడడం, నియోనికోటి నాయిడ్ గ్రూపు మందులను అధికంగా వాడడం వలన ఈ తామర పురుగులు రోగ నిరోధక శక్తిని పెంచుకొని అసంఖ్యాకంగా అభివృద్ధి చెందుతాయి.




## తామర పురుగుల నివారణ చర్యలు

♦ సిఫార్సు చేసిన మేర మాత్రమే నత్రజని వంటి రసాయన ఎరువులు, పురుగు మందులను వాడాలి.

♦ పొలంలో, పొలం చుట్టుపక్కల గట్లపై ఈ పురుగులు ఆశించే కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు నిర్మూలించాలి.

♦ పంట మొక్కలు నీటి ఎద్దడికి గురి కాకుండా నీటి తడులు క్రమం తప్పకుండా ఇవ్వాలి.

♦ వేప నూనె 10000 పి.పి.ఎం. 1 మి.లీ ను లీటరు నీటికి లేదా అజాడిరక్టిన్ 1500 పి.పి.ఎం./3000 పి.పి.ఎం. 2 మి.లీ. లీటరు నీటికి 0.5 గ్రా. సర్ఫ్ లేదా జిగురు మందును కలిపి పిచికారీ చేయాలి.

♦ రైతులు సామూహికంగా ఒక ఎకరానికి 20-30 జిగురు పూసిన నీలి, పసుపు రంగు అట్టలను పొలంలో ఆకుల కింది భాగాలకు దగ్గరగా అమర్చాలి.

♦ మల్చింగ్ విధానంలో డ్రిప్ పెట్టి ఉద్యాన పంటలను సాగు చేయడం ద్వారా కూడా ఈ పురుగు ఉధృతిని కొంతవరకు తగ్గించవచ్చు.

♦ బవేరియా బాసియానా, లేదా వర్టిసీలియం లెకాని అనే జీవ శిలీంద్ర నాశినులను వాడి వీటిని సమర్ధవంతంగా నివారించ వచ్చును.

♦ తామర పురుగులను సమర్ధవంతంగా నివారించడానికి 1 లీటరు నీటికి 2 మి.లీ. ఫిప్రోనిల్ లేదా 2 మి.లీ. డైమిథోయేట్ లాంటి మందులను మార్చి మార్చి పిచికారీ చేయాలి.

♦ అవసరం మేర, సిఫార్సు చేసిన పిచికారీ మందులను ఆకుల అడుగు భాగం, పువ్వుల లోపలి భాగం బాగా తడిచేలా పిచికారీ చేయడంలో తగు జాగ్రత్తలు తప్పక పాటించాలి.





డా.ఎం. నరసింహుడు, అసిస్టెంట్ ప్రొఫెసర్,
డా. కె.వెంకట సుబ్బయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్,
ఉద్యాన కళాశాల, చినలాటరిపి.
నెల్లూరు.



# తమలపాకు సస్యరక్షణ

తమలపాకు మన రాష్ట్రంలో 2824 హెక్టార్లలో సాగులో ఉంది. సుమారు 60,941 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తోంది. ముఖ్యంగా కడప, గుంటూరు, నెల్లూరు, ప్రకాశం, కృష్ణా, ఉభయ గోదావరి, విశాఖ, శ్రీకాకుళం, కర్నూలు, అనంతపురం, విజయనగరం జిల్లాల్లో సాగు చేస్తున్నారు. ఈ పంట సస్యరక్షణ చర్యలు తెలుసుకుందాం.




**ఎండు తెగులు లేదా ఆకు / మొదలుకుళ్ళు తెగులు:** ఆకులపై గుండ్రటి గోధుమ రంగు మచ్చలు గాని గాఢ, లేత గోధుమ రంగు వలయాలతో మచ్చలు వచ్చి నల్లగా మారతాయి. తెగులు తీగ మొదట్లో ఆశించినప్పుడు వేర్లు గోధుమ రంగు నుండి నల్లగా మారి కుళ్ళుతాయి. ఈ దశలో తీగపై పసుపు రంగుకు మారి క్రమంగా ఆకులు, తీగలు ఎండిపోతాయి.

**నివారణ:** నాటేముందు విత్తనపు తీగలను 0.5 % బోర్డోమిశ్రమం, 250 పి.పి.యం (250 మి.గ్రా. లీటరు నీటిలో కలిపి) స్ట్రెప్టోసైక్లిన్ మిశ్రమంలో 10 నిమిషాలుంచి తీగలను శుద్ధి చేయాలి. తెగులు లక్షణాలున్న ఆకులను, తీగలను ఎప్పటికప్పుడు తీసివేయాలి. మొదటి సంవత్సరం తోటల్లో తెగులు లక్షణాలు కనిపించినప్పటి నుంచి నవంబరు నుండి ఫిబ్రవరి వరకు తప్పనిసరిగా నెలకొకసారి 1% బోర్డోమిశ్రమాన్ని 1 మీటరు నిలువు దూరానికి ఒక లీటరు వంతున (ఎకరాకు 40 కిలోల మైలతుత్తం, 40 కిలోల సున్నం చొప్పున 4000 లీటర్ల నీటిలో కలిపి) పాదుల్లో పోసుకుని మరియు 0.5% బోర్డోమిశ్రమాన్ని 15 రోజులకొకసారి (ఎకరాకు 200 లీటర్లు) ఆకులపై పిచికారీ చేయాలి. 2వ సంవత్సరపు తోటల్లో బోర్డోమిశ్రమాన్ని పైన తెలిపినట్లు ఆగస్టు నుండి సెప్టెంబరు వరకు వాడాలి. 3 సంవత్సరాల కొకసారి మొక్కజొన్న, జొన్నలతో పంట మార్పిడి చేసుకోవాలి.




**బాక్టీరియా ఆకుమచ్చ:** విత్తనపు తీగలను ఆరోగ్యవంతమైన తోటలనుండి తీసుకొని, విత్తన తీగశుద్ధి చేసుకొని తెగులు ఆశించకుండా కాపాడుకోవాలి. తెగులు కనిపించిన వెంటనే 500 పి.పి.యం స్ట్రెప్టోసైక్లిన్ 0.5% బోర్డో మిశ్రమం లేదా 0.3% కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను కలిపి నెలకు ఒకసారి పిచికారీ చేయుట వలన ఈ తెగులు సమర్ధవంతంగా నివారించుకోవచ్చు. ఆకుల అడుగు భాగాన నీళ్ళలో తడిసినట్టున్న గోధుమ వర్ణపు చదరపు మచ్చలేర్పడి క్రమంగా పెద్దవై, నలుపు రంగుకు మారి ఆకులు కుళ్ళిపోతాయి. అలాగే కాండంపై నల్లని నిలువ మచ్చలేర్పడి తీగలపై పగుళ్ళు ఏర్పడతాయి.

**నివారణ:** 0.5% బోర్డోమిశ్రమం మరియు స్ట్రెప్టోసైక్లిన్ 250 పి.పి.యం (250 మి.గ్రా.లీటరు నీటిలో కలిపి) నెలకొకసారి 0.1% (1 గ్రా.లీటరు నీటిలో కలిపి) బాక్టీరానాల్ ఆకులపై పిచికారీ చేయాలి.




**కొలటోట్రైకం ఆకుమచ్చ తెగులు:** తెగులు సోకిన ఆకులపై భాగాన గుండ్రని గోధుమ రంగుతో కూడిన పసుపు రంగు అంచుగల మచ్చలేర్పడి క్రమేపి నల్లబడి ఆకు అంతటా వ్యాపిస్తాయి. దీని నివారణకు 0.5% బోర్డో మిశ్రమాన్ని లేక 0.3% కాపర్ ఆక్సిక్లోరైడ్ (3 గ్రా. లీటరు నీటిలో కలిపి ఎకరాకు 600 గ్రా. చొప్పున) ఆకుల పై పిచికారీ చేయాలి.

**పొగాకు లద్దె పురుగు:** దీని వలన ఆకులపై రంధ్రాలు ఏర్పడతాయి. దీని నివారణకు అక్టోబరు మరియు నవంబరు నెలల్లో వేపనూనె 5 మి.లీ. లీటరు నీటికి కలిపి (ఎకరాకు ఒక లీటరు వేపనూనె చొప్పున) కోతకు వచ్చిన ఆకులు కోసిన తరువాత పిచికారీ చేయాలి.

**అగ్గిపురుగు:** ఆకుల రసం పీల్చడం వలన ఆకులపై కాలిన మచ్చలేర్పడతాయి. దీని నివారణకు 2 మి.లీ. క్లోరిపైరిఫాస్ లీటరు నీటికి కలిపి (ఎకరాకు 400 మి.లీ) కోతకు వచ్చిన ఆకులు కోసిన తరువాత పిచికారీ చేయాలి.

**తెల్ల నల్లి/ఎర్ర నల్లి:** తెల్ల నల్లి ఆకుల అడుగు భాగాన చేరి రసం పీల్చడం వలన ఆకులు ముడతబడతాయి. ఎర్రనల్లి ఆశించినపుడు ఆకులు అడుగు ఎరుపు లేదా గోధుమరంగు మచ్చలు కనబడతాయి.




నివారణకు డిసెంబరు – జనవరి నెలల్లో 4 గ్రా. నీటిలో కరిగే గంధకపు పొడిని కలిపి (ఎకరాకు 800 గ్రా.) పిచికారీ చేయాలి.



**నివారణ:** పిల్ల పురుగులు కనిపించిన వెంటనే వేపగింజల కషాయం 5% లేదా వేపనూనె 3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయవచ్చు. ఆకులు కోసిన తరువాత కూడా పురుగు ఉధృతి గమనించినపుడు క్లోరోపైరిఫాస్ 2 మి.లీ నీటికి కలిపి పిచికారీ చేసి ఉధృతి అరికట్టవచ్చు.

**అవిశను ఆశించే పురుగులు:**

**బర్మా పురుగు:** అవిశ మొక్కల కాండపు లోపలి భాగాన్ని గొంగళి పురుగు తొలిచి వేయడం వలన మొక్క బలహీనపడి విరిగిపోతుంది. దీని నివారణకు ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో 2-3 సార్లు అవిశ మొక్కల తలలను గిల్లి వేయాలి.

అవిశ మొక్కలలో ఆఖరి జాడు తీసిన తరువాత ' క్లోరిపైరిఫాస్ 'ను ఎకరాకు లీటరు వంతున, 5-6 రెట్ల నీటితో కలిపి ప్లాస్టిక్ డబ్బాల సహాయంతో అవిశ మొక్కల పైభాగాన 6-7 అంగుళాల పొడవు వరకు పూయాలి. జులై నుండి డిసెంబరు వరకు దీపపు ఎరలను పెట్టుకోవాలి. తీగ నాటిన తర్వాత మోనోక్రోటోఫాస్ చల్లరాదు. పురుగు తొలి దశలో ఉన్నప్పుడు వేపనూనె 3 మి.లీ./లీటరు చొప్పున పిచికారీ చేయాలి.




**అవిశ గొంగళి పురుగు:** గొంగళి పురుగులు ఆశించుట వలన, అవిశ మొక్కలు ఆకులు లేని మోడులై, కొత్తగా నాటిన తమలపాకు తీగలకు కావలసిన నీడను ఇవ్వలేవు. దీని ఫలితంగా, తీగలు అధిక సూర్యరశ్మికి గురై ఎండిపోతాయి.

**ఆకులను తిను గొంగళి పురుగులు:** వీటి నివారణకు తీగ నాటే సమయానికి 1-2 రోజుల ముందు క్లోరోపైరిఫాస్ 2.5 మి.లీ. గాని, క్వినాల్ఫాస్ 2 మి.లీ. గాని, డైమిథోయేట్ 2 మి.లీ. వంతున గాని లీటరు నీటికి కలిపి అవిశ ఆకుల మీద, అవిశ మొక్కల మొదళ్ళలో సాయంత్రం వేళల్లో పిచికారీచేయాలి.

**చిత్తపురుగు:** అవిశ విత్తనం నాటిన 15-20 రోజులకు ఈ పురుగు ఆశించిన ఆకులపై రంధ్రాలు చేసి మొక్కల మొదళ్ళను కొరికి వేయును. నివారణకు క్లోరోపైరిఫాస్ 2.5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.


డా. టి.నాగ లక్ష్మి, సీనియర్ శాస్త్రవేత్త,


డా.పి.సునీత, సీనియర్ శాస్త్రవేత్త

ఉద్యాన విశ్వవిద్యాలయం,
వెంకటరామన్నగూడెం,పశ్చిమగోదావరి,

# సెప్టెంబరులో వివిధ ఉద్యాన పంటలలో చేపట్టవలసిన పనులు



## పండ్ల తోటలు:

**మామిడి** కాండం తొలుచు పురుగు ఆశించే అవకాశం కలదు. ఆశించిన యెడల పురుగులను గట్టి ఇనుప తీగను చొప్పించి బయటకు లాగి చంపివేసి రంధ్రాల్లో పెట్రోలు వేసి బంక మట్టితో మూసి వేయాలి.

**అరటి** తల్లి మొక్క చుట్టూ వచ్చే పిలకల కోతకు ఉపయోగించు కొడవలిని ప్రతీసారీ ముందుగా డీజిల్/కిరోసిన్‌లో ముంచి వైరస్ తెగుళ్ళ వ్యాప్తిని నివారించాలి. వైరస్ తెగులు వ్యాప్తి చేసే పేనుబంక నివారణకు డైమిథోయేట్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. పచ్చ అరటి, కొవ్వూరు బొంత, కర్పూర చక్కెరకేళి రకాలకు రెండవ దఫాగా 110 గ్రా. యూరియా, 80 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఇచ్చి తేలికపాటి తడి ఇవ్వాలి. తేలిక నేలల్లో నులిపురుగుల నివారణకు మొక్కకు 25 గ్రా. చొప్పున కార్బోఫ్యురాన్ గుళికలు మొదలు దగ్గర 10 సెం.మీ. దూరంలో వేసి మట్టితో కప్పి తేలికపాటి తడి ఇవ్వాలి.

**జామ** కాయలు పెరిగే దశలో నీటి తడులు ఇవ్వాలి. తొడిమ కుళ్ళు తెగులు నివారణకు 1% బోర్డోమిశ్రమం లేదా 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటికి కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

**దానిమ్మ** బాక్టీరియా మచ్చ తెగులు సోకిన కొమ్మలను, తెగులు సోకిన భాగం నుండి రెండు అంగుళాలు క్రిందకు 2% సోడియం హైపోక్లోరైడ్ ద్రావణంలో ముంచిన కత్తెరలతో కత్తిరించి 1% బోర్డోమిశ్రమం పిచికారీ చేయాలి. కత్తిరించిన కొమ్మలను, ఆకులను, కాయలను కాల్చివేసి, చెట్టు పాదులలో 8-10 కేజీల బ్లీచింగ్ పౌడర్‌ను ఒక ఎకరాకు వాడేలా చల్లాలి.

**నిమ్మ** వర్షాలు పడితే గజ్జి తెగులు నివారణకుగాను కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రా. మరియు స్ట్రెప్టోసైక్లిన్ 1 గ్రా./10 లీటర్ల నీటికి కలిపి చెట్ల మొదలు, కొమ్మలు, రెమ్మలు, చెట్టంతా తడిచేటట్లు పిచికారీ చేయాలి. పల్లాకు తెగులు నివారణకు సూక్ష్మధాతు మిశ్రమాన్ని పిచికారీ చేయాలి. కొత్తగా నాటుకొనే తోటలకు పొలాన్ని తయారుచేసుకోవచ్చు. మంగునల్లి నివారణకు నీటిలో కరిగే గంధకం 3 గ్రా./లీ. నీటికి కలిపి పిచికారీ చేయాలి. కాయతొడిమ కుళ్ళు తెగులు నివారణకు కార్బండిజమ్ 1 గ్రా./లీ. నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

**బొప్పాయి నారు పెంపకం:** ఎకరాకు డైయిషియస్ రకాలకు 200 గ్రా. మరియు గైనోడైయిషియస్ రకాలకు 20 గ్రా. విత్తనం కావాలి. విత్తనాన్ని 22.5×15 సెం.మీ. – 150 గేజ్ మందం గల పాలిథిన్ సంచులలో పశువుల ఎరువు, ఇసుక కలిపిన మట్టితో నింపి నాటాలి. విత్తనాలను 1 సెం.మీ. లోతు మించకుండా విత్తుకోవాలి. నారుమడిలో వైరస్ తెగుళ్ళు సోకకుండా నారును రసం పీల్చే పురుగులు చొరబడని వల లోపల పెంచాలి లేదా అవిశ మొక్కలను విత్తనం నాటే 15 రోజుల ముందు నారుమడి చుట్టూ నాటుకోవాలి.

**ఉసిరి** నల్లమచ్చ తెగులు నివారణకు 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటికి లేదా 1% బోర్డోమిశ్రమం పిచికారీ చేయాలి.

### తోట పంటలు:

**జీడిమామిడి** భూసార అభివృద్ధికి జీడి తోటలలో పచ్చిరొట్టపైర్లు వేసుకుంటే 50% పూతరాగానే పచ్చిరొట్ట పైర్లను నేలలో కలిసేలా దున్నాలి. ఆకుగూడు కట్టు పురుగు, కొమ్మ తొలిచే పురుగు నివారణకు తగిన సస్యరక్షణ చేపట్టాలి. తెగులు సోకిన కొమ్మలను, రెమ్మలను కత్తిరించి నాశనం చేయాలి. చివరి సారిగా పొలాన్ని దున్నాలి. దీని వల్ల కలుపు ఏదైనా ఉంటే నివారించబడుతుంది. నేలలో నిద్రావస్థలో ఉన్న పురుగులు నశిస్తాయి. నేల గుల్లబారి, నేల నుంచి తడి ఆవిరై పొడిగా తయారై, బెట్ట పరిస్థితులు ఏర్పడతాయి. అందువల్ల పూతరెమ్మలు త్వరగా ముదిరి, పూతకు సిద్ధమై, శాఖీయ పెరుగుదల తగ్గి పూత బాగా రావడానికి అవకాశముంటుంది.

**కొబ్బరి** ఆశించు ఎర్రముక్కు పురుగు, మొవ్వ కుళ్ళు, నల్లమచ్చ

తెగులు ఉనికిని పరిశీలిస్తూ ఉండాలి. తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. **ఎర్రముక్కు పురుగు యాజమాన్యం:** ఈ పురుగు ఆశించి చనిపోయిన చెట్ల కాండములను సత్వరమే నరికి, చీల్చి తగులబెట్టాలి. ఎర్రముక్కు తల్లి పురుగులను గుంపుగా ఆకర్షించు కృత్రిమ ఎరను బక్కెట్లో ఉంచి, కొబ్బరి చెట్టు కాండమునకు 1 1/2 మీటర్ల ఎత్తులో అమర్చినచో, ఎర్రముక్కు తల్లి పురుగులు ఆకర్షితమై, బక్కెట్ లోపల గల విషాహారంలో పడి చనిపోతాయి. సగం డొల్ల అయిన కాండములోని చెత్త, కుళ్ళు పదార్థమును శుభ్రం చేసి, పుండుపై కోల్‌తార్ లేక జపాన్ బ్లాక్‌ను పూతగా పూయాలి. చెట్టు తొర్రను సిమెంట్, ఇసుక, కంకర మిశ్రమముతో పూడ్చినచో, చెట్టు బలంగా ఉండి, పెద్ద గాలులు వచ్చినపుడు పడకుండా ధృఢంగా ఉంటుంది.

**మొవ్వుకుళ్ళు తెగులు యాజమాన్యం:** మొవ్వుభాగం తడిచేలా కాపర్ ఆక్సీక్లోరైడ్ (3 గ్రా./లీటరు నీటిలో కలిపి) పిచికారీ చేయాలి. కాయకుళ్ళు సోకిన గెలను తొలగించి, ఇతర గెలలు, మొవ్వుభాగం తడిచేలా కాపర్ ఆక్సీక్లోరైడ్ (3 గ్రా./ లీటరు నీటిలో కలిపి) పిచికారీ చేయాలి.

**నల్లమచ్చ తెగులు యాజమాన్యం:** కొబ్బరి చెట్టు కాండంపై ఎటువంటి గాయం కలిగించరాదు. ఈ తెగులు లక్షణాలు కాండముపై కనిపించిన వెంటనే, ఆ భాగంపై ట్రైకోడెర్మా విరిడి శిలీంధ్రపు పొడిని పేస్ట్‌గా తయారుచేసి పూయాలి. (50 గ్రాముల పొడికి 25 మి.లీ. నీటిని కలిపిన పేస్ట్ తయారవుతుంది).

**కూరగాయ పంటలు: బెండ, టమాట, వంగ** పంటల్లో సిఫార్సు చేసిన నత్రజని ఎరువులను వేసుకొని నీరు పెట్టాలి. ఈ పంటలలో వైరస్ తెగుళ్ళ వ్యాప్తిని అరికట్టేందుకు రసం పీల్చే పురుగులను నివారించాలి. రసం పీల్చే పురుగుల నివారణకు ఫిప్రోనిల్ మందును లీటరు నీటికి 2 మి.లీ.ల చొప్పున కలిపి పిచికారీ చేయాలి. తెల్లదోమ నివారణకు 1.5 గ్రా. ఎసిఫేట్‌ను 1 లీ. నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి. కాయతొలుచు పురుగు నివారణకు ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

**క్యాబేజి, కాలీఫ్లవర్** (మధ్యకాలిక రకాలు) నారును ప్రధాన పొలంలో నాటుకోవాలి.

**క్యారెట్, ముల్లంగి** మరియు **బీట్‌రూట్** పంటలను విత్తుకునే సమయం. ఉల్లి నారు (రబీ పంటకొరకు) పోసుకునే సమయం. 3 గ్రా. థైరమ్ లేదా కాప్టాన్ మందును ఒక కిలో విత్తనానికి పట్టించి విత్తన శుద్ధి చేయాలి.

**తీగ జాతి కూరగాయలను** ఆశించే బూడిద తెగులు నివారణకు కెరాథేన్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పండు ఈగ నివారణకు 2 మి.లీ. మలాథియాన్ 100 మి.లీ. 100 గ్రా. చక్కెర లేదా బెల్లం + 10 లీ. నీరు కలిపి విషపు ఎర తయారు చేసి మట్టి మూకుడులో/ప్లాస్టిక్ పళ్ళాలలో పోసి ఎకరాకు 10-12 మూకుడులను అక్కడక్కడ పెట్టాలి.

**కంద** ఇనుపధాతు లోపాన్ని సవరించడానికి లీటరు నీటికి 5 గ్రా. అన్నభేది, 1 గ్రా. నిమ్మ ఉప్పు కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

**చేమ** ఆఖరి దఫాగా ఎకరాకు 35 కిలోల యూరియా, 18 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను మొక్కకు ఇరువైపులా గుంటలో వేసి కప్పి తేలికపాటి తడి ఇవ్వాలి.

**పెండలం** మూడవ దఫాగా ఎకరాకు 28 కిలోల యూరియా, 18 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను వేసి తేలికపాటి తడిని ఇవ్వాలి. అవసరాన్ని బట్టి నీటి తడులు ఇవ్వాలి.

**ఉల్లి** రెండవ, మూడవ దఫా ఎరువులు ఎకరానికి 20 కిలోల నత్రజని, 10 కిలోల పొటాష్ చొప్పున నారు నాటిన 30 మరియు 40 రోజులకు వేసి నీరు ఇవ్వాలి. 12-15 రోజుల వ్యవధిలో పంటకు నీటి తడులు ఇవ్వాలి. తామర పురుగుల నివారణకు ఫిప్రోనిల్ 2 మి.లీ./లీటరు నీటికి కలుపుకొని పిచికారీ చేయాలి.

**పూలతోటలు:**

**చామంతి** నాటిన 30 రోజులకు తలను తుంచి వేయాలి. పువ్వు పరిమాణాన్ని పెంచటానికి పక్క నుండి వచ్చిన పూ మొగ్గలను తుంచివేసి మధ్య వున్న మొగ్గల పరిమాణం పెరిగేటట్లు చూడాలి. కలుపు రాకుండా మొక్కల మధ్య ఎండుటాకులు లేదా ఎండుగడ్డిని కప్పాలి.

**నేల సంపంగి (లిల్లీ)** తోటలలో ఎకరాకు 27 కిలోల చొప్పున నత్రజని, భాస్వరం, పొటాష్ నిచ్చే ఎరువులను పైపాటుగా వేయాలి. కొద్దిగా విచ్చిన పూలను తెంపి వెదురుబుట్టలలో ఉంచి మార్కెట్‌కు తరలించాలి.



**డా. ఇ.కరుణశ్రీ,** విస్తరణ సంచాలకులు
**డా.ఎల్.నారం నాయుడు,** పరిశోధన సంచాలకులు
డా. వై.ఎస్.ఆర్.ఉద్యాన విశ్వవిద్యాలయం
వెంకటరామన్నగూడెం, పశ్చిమగోదావరి.



# 80 శాతం రాయితీ పై విత్తనాలు అందించండి

రాయలసీమ జిల్లాల్లోని ఏ ఒక్క రైతు ఆదాయం తగ్గకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖామాత్యులు కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. సీమ జిల్లాల్లో ఖాళీగా ఉన్న వ్యవసాయ భూముల్లో సాగు ప్రోత్సహించడంతో పాటు రైతులకు మేలు చేకూర్చేందుకు 80 శాతం రాయితీపై విత్తనాలు అందించాలని అధికారులను ఆదేశించారు. వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు రాయలసీమలోని 8 జిల్లాల వ్యవసాయ ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

రాష్ట్రంలో డిమాండ్ ఉన్న పంటలకు, రైతులు కోరుకునే రకాల విత్తనాలు సిద్ధం చేయడంతో పాటు అటువంటి విత్తనాలకు రాయితీ కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

సాగుకు దూరంగా ఉన్న భూముల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతులకు సూచనలివ్వాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటల వాస్తవ అంచనాలను రూపొందించాలని, రైతులకు సాధారణ సాగులో ఆదాయం తగ్గకుండా ప్రత్యామ్నాయ పంటలను సూచించాలన్నారు.

ఇప్పటికే సాగులో ఉన్న పంట దిగుబడులు తగ్గకుండా తగు చర్యలు తీసుకోవలని సూచించారు. సాధారణ స్థాయి కంటే అధిక వర్షపాతం ఉన్నా సాగు మాత్రం తక్కువ విస్తీర్ణంలో నమోదు అవడం వలన స్వల్పకాలంలో దిగుబడి వచ్చే పంటలు ప్రోత్సహించాలని కోరారు. ఒకేసారి వర్షం అధికంగా పడడం, ఎక్కువగా డ్రై స్పెల్స్ నమోదు అవడం వలన సాగు విస్తీర్ణం తగ్గిందని అధికారులు తెలిపారు.

రాయలసీమ జిల్లాల్లో ఇప్పటివరకు నమోదైన వర్షపాత వివరాలు, వివిధ పంటల సాగు విస్తీర్ణం, పంట సాగు చేయని మిగిలిన విస్తీర్ణంలో అనుకూలమైన ప్రత్యామ్నాయ పంటల ఎంపిక తదితర అంశాలపై చర్చించారు. రాయలసీమ జిల్లాల వ్యవసాయ అధికారులు ఆయా జిల్లాల్లోని వ్యవసాయ క్షేత్ర పరిస్థితులను మంత్రికి వివరించారు. గత ఏడాది జూన్ నుండి ఇప్పటి వరకు నెలవారీగా వాస్తవ పంటల సాగు విస్తీర్ణం, వర్షపాతం వివరించారు. వర్షం నమోదైన రోజులు తదితర పరిస్థితులను సాధారణ సాగు విస్తీర్ణం తదితర అంశాలతో బేరీజు చేస్తూ చర్చించారు.

వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్. డిల్లీ రావు మాట్లాడుతూ రాయలసీమ జిల్లాల్లో 15,03,613 హెక్టార్ల సాధారణ సాగు విస్తీర్ణానికి గాను, ఇప్పటివరకు 11,24,351 హెక్టార్ల విస్తీర్ణంలో వివిధ పంటలు సాగయ్యాయని, 3,79,262 హెక్టార్ల సాగు భూములు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయని తెలిపారు. వాటి స్థానం లో ప్రత్యామ్నాయంగా 2,22,349 హెక్టార్లలో ఉలవలు, మిగిలిన విస్తీర్ణంలో పెసర, అలసందలు, జొన్న, కొర్ర, మినుము, సజ్జ పంటలు సిఫారసు చేశారని తెలిపారు. వీటిపై జిల్లా వ్యవసాయ అధికారులు 80 శాతం విత్తన రాయితీ ప్రతిపాదనలపై ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ త్వరలో సరఫరా ఏజెన్సీలను నియమించి విత్తన పంపిణీ చేస్తామని తెలియజేశారు.



## సమీకృత రైతు సమాచార కేంద్రం టోల్ ఫ్రీ నంబరు 155251 కు రైతుల ప్రశ్నలు - సమాధానాలు

## వ్యవసాయ పంటలు

1) పేరు: మట్లపూడి శ్రీను, గ్రామం: సానరుద్రవరం, మండలం: కలిదిండి, జిల్లా: ఏలూరు, ఫోన్ నెంబర్: 9866020537.

ప్ర: 26 రోజుల వరి పంటలో తాటాకు తెగులు ఆశించింది. నివారణ తెలుపగలరు?

జ: వరిలో తాటాకు తెగులు(హిస్పా) నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా ప్రొఫెనొఫాస్ 2 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

2) పేరు: రాజు, గ్రామం: యల్లారెడ్డిపల్లి, మండలం: దార్లపల్లె, జిల్లా: నిజామాబాద్, ఫోన్ నెంబర్: 9642628865.

ప్ర : పత్తి ఆకుల అడుగు భాగంలో రసం పీల్చే పురుగులు ఆశించినవి, సలహా ఇవ్వగలరు ?

జ: పత్తిలో పేనుబంక నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.4 మి.లీ. లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. లేదా థయామిథాక్సాం 0.2 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

3) పేరు: కాశయ్య, గ్రామం: లంకోజనపల్లి, మండలం: దర్శి, జిల్లా: ప్రకాశం, ఫోన్ నెంబర్: 9032262226.

ప్ర: కంది పంట వేయాలనుకుంటున్నాను, ఎండు తెగులును తట్టుకొనే రకాలు సూచించగలరు?

జ: కందిలో ఎల్.ఆర్.జి -52, ఎల్.ఆర్.జి -105, ఎల్.ఆర్.జి -133, ఐ.సి.పి.ఎల్-87119 అనేవి ఎండు తెగులను తట్టుకుంటాయి.

4) పేరు: నరేష్, గ్రామం: ఘంటావారిగూడెం,మండలం: నల్లజర్ల, జిల్లా: తూర్పుగోదావరి, ఫోన్ నెంబరు: 8500446054.

ప్ర: అపరాలు సాగు చేయాలనుకుంటున్నాం. ఖాళీ పొలంలో గడ్డి జాతి కలుపు ఎక్కువగా ఉంది. నివారణ తెలుపగలరు?

జ: ఖాళీ పొలంలో గడ్డి జాతి కలుపు నివారణకు గ్లైఫోసినేట్ అమ్మోనియం 1 లీటరు లేదా పారాక్వాట్ డైక్లోరైడ్ 1 లీటరు ను 200 లీటర్ల నీటికి కలిపి ఎకరానికి పిచికారీ చేసుకోవాలి.

5) పేరు: నాగరాజు, గ్రామం: నార్లపాలెం, మండలం: వెల్దుర్తి, జిల్లా: కర్నూలు, ఫోన్ నెంబరు: 9493903840.

ప్ర: పొగాకు నారుమడిలో గుంపులు గుంపులుగా మొక్కలు కుళ్ళి చనిపోతున్నాయి. నివారణ తెలుపగలరు?

జ: పొగాకులో మాగుడు తెగులు నివారణకు లీటరు నీటికి కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. చొప్పున కలిపి నారుమడి తడిచేటట్టు తడపాలి.

6) పేరు: పూసలపాటి తిరుపతయ్య, గ్రామం: పూసలపాడు, మండలం: బేస్తవారిపేట, జిల్లా: ప్రకాశం, ఫోన్ నెంబర్: 9701116105.

ప్ర: పెసరలో ఆకుల అడుగు భాగంలో తెల్లదోమ ఆశించినది, నివారణ తెలుపగలరు ?

జ: పెసరలో తెల్లదోమ నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా థయామిథాక్సాం 0.2 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

7) పేరు: వెంకయ్య, గ్రామం: ఎ. కొండూరు, మండలం: ఎ. కొండూరు, జిల్లా: కృష్ణా, ఫోన్ నెంబర్: 8106759529.

ప్ర: ఉలవలు పంట వేయాలనుకుంటున్నాను, ఏ సమయంలో విత్తుకోవాలి, దిగుబడి ఎంత వస్తుందో చెప్పగలరు?

జ: ఉలవలు పంటను సెప్టెంబర్ నుంచి అక్టోబర్ వరకు విత్తుకోవచ్చు. ఎకరానికి సుమారు 5-7.5 క్వింటాళ్ళ దిగుబడి వస్తుంది.

8) పేరు: లింగారెడ్డి రామకోటిరెడ్డి, గ్రామం: కారేడు, మండలం: ఉలవపాడు, జిల్లా: నెల్లూరు, ఫోన్ నెంబర్: 9494904909.

ప్ర: వేరుశనగలో ఆకులపై నల్లటి మచ్చలు ఏర్పడుతున్నాయి, నివారణ తెలుపగలరు?

జ: వేరుశనగలో తిక్కా ఆకు మచ్చ తెగులు నివారణకు హెక్సాకొనజోల్ 2 మి.లీ. లేదా క్లోరోథలోనిల్ 2 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలి.

## ఉద్యానశాఖ

**1) పేరు: ఎన్.సూర్యనారాయణ రెడ్డి, గ్రామం: చాపట్ల, మండలం: రాప్తాడు, జిల్లా: అనంతపురం, ఫోన్ నెంబర్: 953365217.**

ప్ర: మామిడిలో ఆకుల చివర్లు ఎండిపోయి, ముడుచుకొని పోతున్నాయి, నివారణ చెప్పగలరు?

జ: మామిడిలో పేనుబంక నివారణకు అజాడిరక్టిన్ (3000 పి.పి.యం) 3 మి.లీ. లేదా థయోమిథాక్సాం 0.3 గ్రా. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలి. ఆకు మాడు తెగులుకు హెక్సాకొనజోల్ 2 మి.లీ. లేదా కార్బండిజమ్ + మాంకోజెబ్ 2 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలి.

**2) పేరు: సుంకన్న, గ్రామం: మద్దికెర ఈస్ట్, మండలం: మద్దికెర, జిల్లా: కర్నూలు, ఫోన్ నెంబర్: 6304717680.**

ప్ర: మిరపలో మొక్కలు ఎండిపోతున్నాయి, నివారణ తెలుపగలరు?

జ: మిరపలో కాండం కుళ్ళు తెగులు నివారణకు థయోఫనేట్ మిథైల్ 2 గ్రా. లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా.ను లీటరు నీటికి చొప్పున కలిపి మొక్కల మొదళ్ళలో పోయాలి. వారం రోజుల తరువాత ఎకరానికి 100 కేజీల ట్రైకోడెర్మా విరిడి కల్చర్ ను పొలంలో చల్లుకోవాలి.

**3) పేరు: శంకర్, గ్రామం: సువర్ణపురం, మండలం: మందస, జిల్లా: శ్రీకాకుళం, ఫోన్ నెంబర్: 9398112711.**

ప్ర: కొబ్బరిలో కాండం ఎర్రటి జిగురు పదార్థాన్ని స్రవిస్తోంది, ఆకులు పసుపు రంగులోకి మారి ఎండిపోతున్నాయి. నివారణ తెలపండి ?

జ: కొబ్బరిలో ఎర్రముక్కు పురుగును తీసిన రంధ్రాలలో వేపపిండి 100 గ్రా.+ ఇసుక 150 గ్రా. మిశ్రమాన్ని కూరాలి. రైనోల్యూర్ ను అక్కడక్కడ అమర్చి తల్లి పురుగులను చంపాలి. ఇమిడాక్లోప్రిడ్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పురుగు తొలచిన భాగంలోకి పోయాలి. సగం డొల్ల అయిన కాండంలో కుళ్ళును తీసి సిమెంటు, ఇసుక, రాళ్ళతో పూడ్చాలి.

**4) పేరు: గొల్ల నాగరాజు, గ్రామం: సి. బెళగల్, మండలం: సి. బెళగల్, జిల్లా: కర్నూలు, ఫోన్ నెం: 9347401708.**

ప్ర: ఉల్లిగడ్డ లో కలుపు నివారణ గురించి చెప్పగలరు?

జ: ఉల్లిగడ్డలో కలుపు నివారణకు ఒక ఎకరాకు ఫ్లూక్లోరాలిన్ 1 లీటరు చొప్పున పిచికారీ చేసి భూమిలో కలియదున్నాలి లేదా పెండిమిథాలిన్ ఎకరాకు 1.3 నుండి 1.6 లీ. లేదా ఆక్సీఫ్లోరోఫిన్ 200 మి.లీ. చొప్పున ఏదో ఒక దానిని నాటే ముందు పిచికారీ చేయాలి లేదా నాటిన 2,3 రోజుల్లో తేమ ఉన్నప్పుడు ఆక్సిఫ్లోరోఫిన్ 200 మి.లీ.ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. నాటిన 30,35 రోజుల మధ్య మరలా కలుపుతీసి మట్టిని ఎగదోయాలి.

**5) పేరు: నెట్టికళ్ళప్పగారి రఘునాథ రెడ్డి, గ్రామం: జక్కలవడికి, మండలం: కణేకల్లు, జిల్లా: అనంతపురం, ఫోన్ నెం: 9441164938.**

ప్ర: టమాటాలో ఆకులు వంకర్లు తిరిగి మాడిపోతున్నాయి. నివారణ చెప్పగలరు?

జ: టమాటాలో ఆకుముడత వైరస్ తెగులును వ్యాప్తి చేసే తెల్లదోమ నివారణకు ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా థయామిథాక్సాం 0.4 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.4 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఎకరాకు పసుపు రంగు అట్టలు 20 చొప్పున పెట్టాలి.

**6) పేరు: పురుషోత్తం, గ్రామం: గుడిపాల, మండలం: గుడిపాల, జిల్లా: చిత్తూరు, ఫోన్ నంబర్: 9703977118.**

ప్ర: బొప్పాయిలో ఆకులపై పసుపు వర్ణం, లేత ఆకుపచ్చ వర్ణం కలగలపినట్టుగా ఉన్నది. నివారణ తెలుపగలరు?

జ: బొప్పాయిలో మొజాయిక్ వైరస్ ను వ్యాప్తి చేసే పేనుబంక నివారణకు ఎసిఫేట్ 2.5 గ్రా. + వేపనూనె 5 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధితో 2 సార్లు పిచికారీ చేసుకోవాలి. కలుపు తీసివేయాలి. పేనుబంక ఉధృతి తగ్గిన తరువాత ఎకరాకు ఒక కిలో ఫార్ములా-6 పిచికారీ చేయాలి.

**7) పేరు: కర్లపూడి తేజ, గ్రామం: గుడివాడ, మండలం: తెనాలి, జిల్లా: గుంటూరు, ఫోన్ నెం: 9493924140.**

ప్ర: బంతి తోటలో నత్తలు మొక్కలను నష్టపరుస్తున్నాయి, నివారణ తెలపగలరు?

జ: బంతి తోటలో నత్తల నివారణకు మిథియోకార్బ్ 3% జి + వరి తవుడు ను సరిపడా కలిపి నష్టం చేసిన మొక్కల వద్ద మరియు అవి తిరిగే చోట్ల వేసుకోవాలి.

**8) పేరు: నాగరాజు, గ్రామం: నార్లపల్లి, మండలం: వెల్దుర్తి, జిల్లా: కర్నూలు, ఫోన్ నెం: 9493903840.**

ప్ర: మిరపలో మొక్కలు ఎండిపోతున్నాయి, నివారణ తెలుపగలరు?

జ: మిరపలో ఎండు తెగులు నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రా. లేదా మెటలాక్సిల్ 2 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి మొక్క మొదళ్ళలో పోసుకోవాలి.

# సమీకృత రైతు సమాచార కేంద్ర వాట్సాప్ నెంబర్లకు వచ్చిన రైతుల సందేహాలు - సమాధానాలు

83310 56028 83310 56149
83310 56150 83310 56152
83310 56153 83310 56154



1. రైతుపేరు: నల్లగట్ల సుధాకర్, గ్రామం :కొత్తపల్లె, మండలం: డోన్, జిల్లా : నంద్యాల, ఫోన్ నెంబర్: 9951863511.

ప్ర. బెండలో ఆకులు వాడి ఎండిపోతున్నాయి, నివారణ తెలపండి ?

జ. బెండలో ఎండు తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి చొప్పున కలుపుకొని మొక్కల మొదళ్ళ దగ్గర పోయాలి. వేప పిండిని ఎకరానికి 100 కిలోల చొప్పున మొక్కల వేళ్ళకు దగ్గరగా సాళ్ళ వెంట వేసుకొని మట్టి కప్పేటట్లు గొర్రు లేదా గుంటకతో లేదా మనుషులతో అంతర కృషి చేసుకోవాలి.



2. రైతుపేరు: పేరపు కొండబాబు, గ్రామం : తునివలస, మండలం: చీడికాడ, జిల్లా : అనకాపల్లి, ఫోన్ నెంబర్: 9491907310

ప్ర. పెసరలో ఆకులు పసుపు రంగులోకి మారుతున్నాయి, నివారణ తెలపండి ?

జ. పెసరలో పచ్చదోమ, తెల్లదోమ నివారణకు థయోమిథాక్సాం 0.2 గ్రా. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారీ చేసుకోవాలి.



3 రైతుపేరు: చాకలి తేజ, గ్రామం : కులుమాల, మండలం: గోనెగండ్ల, జిల్లా : కర్నూలు, ఫోన్ నెంబర్: 6304681103.

ప్ర. వేరుశనగలో ఆకులపై తుప్పు లాంటి మచ్చలు ఏర్పడుతున్నాయి. సూచన ఇవ్వగలరు ?

జ. వేరుశనగలో తుప్పు లేదా కుంకుమ తెగులు నివారణకు క్లోరోథలోనిల్ 2 గ్రా. లేదా హెక్సాకొనజోల్ 2 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి వారం రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేసుకోవాలి.



4 రైతుపేరు: మోపూరి కేశవరెడ్డి, గ్రామం : మేడికుర్తి, మండలం: యల్లనూరు, జిల్లా : అనంతపురం, ఫోన్ నెంబర్:9491431355.

ప్ర. బత్తాయిలో కాయపై గోధుమ రంగు వలయాకారపు మచ్చ ఏర్పడుతుంది, నివారణ తెలపండి ?

జ. బత్తాయిలో కాయ తొడిమ కుళ్ళు తెగులు నివారణకు కార్బండిజమ్ 100 గ్రా. లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 300 గ్రా. తో పాటు జిగురు పదార్థం 50 మి.లీ. ను ప్రతి 100 లీటర్ల నీటికి చొప్పున కలిపి చెట్లు పూర్తిగా తడిచేలా పిచికారీ చేసుకోవాలి.



5 రైతుపేరు: వియ్యపు నాగరాజు, గ్రామం : పొట్టిగవరపాలెం, మండలం: బుచ్చెయ్య పేట, జిల్లా : అనకాపల్లి, ఫోన్ నెంబర్:6281716386.

ప్ర. వంగలో మొక్కలు వాడి చనిపోతున్నాయి. నివారణ తెలియజేయండి ?

జ. వంగలో ఎండు తెగులు నివారణకు మెటలాక్సిల్ 1 గ్రా. లేదా కార్బండిజమ్ 1 గ్రా. లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధితో 2 సార్లు పిచికారీ చేసుకోవాలి. ట్రైకోడెర్మా విరిడి కల్చర్ ను ఎకరాకి 2-3 కిలోల చొప్పున దుక్కిలో వాడాలి. ఒక కిలో ట్రైకోడెర్మా విరిడి, 10 కిలోల వేపపిండి, 90 కిలోల పశువుల ఎరువుతో కలిపి తగినంత తేమ ఉండేట్టు చూసుకుంటూ 10-15 రోజులు నీడలో ఆరబెట్టి పొలంలో చల్లాలి. ఇలా చల్లే ముందు, తరువాత రసాయన మందులను పిచికారీ చేయకూడదు.

6 రైతు పేరు:దేరింగులనరసింహులు, గ్రామం : మోసపేట, మండలం: మోసపేట, జిల్లా : అన్నమయ్య, ఫోన్ నెంబర్: 9346277807



**ప్ర.** నేరేడులో ఆకులను గొంగళి పురుగులు తింటోంది. నివారణ చెప్పండి ?

**జ.** నేరేడులో ఆకు తినే గొంగళి పురుగు నివారణకు అజాడిరక్టిన్ (10000 పి.పి.ఎం.) 2.5 మి.లీ. లేదా క్వినాల్ ఫాస్ 2 మి.లీ. లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి వారం రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేసుకోవాలి.

7 రైతు పేరు: గొల్ల నాగరాజు, గ్రామం : సి.బెళగల్, మండలం: సి.బెళగల్, జిల్లా : కర్నూలు, ఫోన్ నెంబర్:9347401708.



ప్ర. గోరుచిక్కుడు ఆకుల పై మచ్చలు ఏర్పడ్డాయి. నివారణ తెలపండి?

జ. గోరుచిక్కుడులో ఆకుమచ్చ తెగులు నివారణకు ఒక ఎకరానికి మాంకోజెబ్ 500 గ్రా. లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 600 గ్రా.ను 200 లీటర్ల నీటికి చొప్పున కలిపి మొక్కలు పూర్తిగా తడిచేలా తెగులు తగ్గేంతవరకు మందులను మార్చి మార్చి 7 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయాలి.

8 రైతు పేరు:ప్రత్తిగొడుపు ప్రకాశరాజు, గ్రామం : బైటమంజూలూరు, మండలం: జె.పంగలూరు, జిల్లా : బాపట్ల, ఫోన్ నెంబర్: 9392097330.



ప్ర. వరిలో ఆకుల చివర్లు పసుపు గోధుమ రంగు నుండి ముదురు గోధుమ రంగులోకి మారుతున్నాయి, నివారణ సూచించగలరు ?

జ. వరిలో పొటాష్ ధాతు లోప సవరణకు ఎకరాకు మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 20 కిలోల చొప్పున బురద పదును మీద వేసుకొని 2 రోజుల తరువాత తేలికగా నీటిని అందించాలి.

9 రైతు పేరు: నల్లగట్ల సుధాకర్, గ్రామం : కొత్తపల్లె, మండలం: డోన్, జిల్లా : నంద్యాల, ఫోన్ నెంబర్: 9951863511.



ప్ర. మొక్కజొన్నలో ఆకులను పురుగు తింటోంది, నివారణ తెలపండి ?

జ. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా క్వినాల్ ఫాస్ 2 మి.లీ. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో 2 సార్లు సుడులు లేదా మొవ్వ లోపలి ఆకులు పూర్తిగా తడిచేలా పిచికారీ చేయాలి

10 రైతు పేరు:గుణగంటిరామస్వామి, గ్రామం :ఈదుట్ల, మండలం: గోపల్లపేట, జిల్లా : వనపర్తి, ఫోన్ నెంబర్: 9502280472.



ప్ర. కూర మిరపలో ఆకులు రాలిపోయి మొక్కలు చనిపోతున్నాయి నివారణ తెలుపగలరు?

జ. మిరపలో బూజు కుళ్ళు తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లేదా కార్బండిజమ్ 1 గ్రా. లేదా మెటలాక్సిల్ 2 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధితో 2 సార్లు పిచికారీ చేసుకోవాలి.

# సమీకృత రైతు సమాచార కేంద్రానికి రైతులు తరచూ అడిగే ప్రశ్నలు

## వ్యవసాయ పంటలు

1) పేరు: విజయ్ కుమార్, గ్రామం: దువ్వూరు, మండలం: దువ్వూరు, జిల్లా: వై.యస్.ఆర్ కడప, ఫోన్ నెంబర్: 8341166316.

ప్ర: మినుములో కాండపు ఈగ ఆశించింది. నివారణ చెప్పగలరు?

జ: మినుములో కాండపు ఈగ నివారణకు ఎసిఫేట్ 1గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.4 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

2) పేరు:మీరావలి, గ్రామం: పరిటాలవారిపాలెం, మండలం: సంతమాగులూరు, జిల్లా: ప్రకాశం, ఫోన్ నెంబర్: 9390383236.

ప్ర : కందిలో మొక్కలు ఎండిపోతున్నాయి, నివారణ చెప్పండి?

జ : కందిలో ఎండు తెగులు నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 3గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి మొక్క మొదల్లో పోసుకోవాలి.

3) పేరు: జగన్నాధం నాయుడు, గ్రామం: గంగావిల్లి, మండలం: బలిజిపేట, జిల్లా: పార్వతీపురం మన్యం, ఫోన్ నెంబరు: 9494692145.

ప్ర: మొక్కజొన్నలో ఆకులు ఎర్రగా మారుతున్నాయి, నివారణ తెలపండి ?

జ: మొక్కజొన్నలో భాస్వరం లోపం సవరణకు డి.ఎ.పి 54 కేజీలు లేదా ఎస్. ఎస్.పి 156 కేజీలు ఎకరం పొలంలో విత్తనం విత్తే సమయంలో వేసుకోవాలి. నానో డి.ఎ.పి 500 మి.లీ. ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

4) పేరు: ఆర్. వెంకయ్య, గ్రామం: ఏ. కోడూరు, మండలం: ఏ. కోడూరు, జిల్లా: కృష్ణా, ఫోన్ నెంబర్: 8106759529.

ప్ర: 20 రోజుల పత్తి పంటలో గడ్డి జాతి, వెడల్పాకు కలుపు ఉంది. నివారణ చెప్పండి?

జ: పత్తి పంటలో గడ్డి జాతి, వెడల్పాకు కలుపు నివారణకు క్విజలోఫాప్ ఇథైల్ 400 మి.లీ., పైరిథయోబ్యాక్ సోడియం 250 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారీ చేసుకోవాలి.

## ఉద్యాన పంటలు

1) పేరు: రెడ్డివారి రాజగోపాలరెడ్డి, గ్రామం: మొలకతాళ్ల, మండలం: పెద్దవడుగూరు, జిల్లా: అనంతపురం, ఫోన్ నెంబర్: 8639499260.

ప్ర: బత్తాయిలో రెక్కల పురుగులు పండ్లపై రంధ్రాన్ని చేసి రసాన్ని పీలుస్తున్నాయి, పండ్లు కుళ్ళి రాలిపోతున్నాయి. నివారణ చెప్పండి?

జ: బత్తాయిలో పండ్ల రసాన్ని పీల్చే రెక్కల పురుగుల నివారణకు ఎకరానికి ఒకటి చొప్పున ఫ్లోరోసెంట్ బల్బులను సాయంత్రం 7 నుండి ఉదయం 6 వరకు పెట్టాలి. బెల్లం లేదా గంజి పొడి 100 గ్రా. + క్లోరిపైరిఫాస్ 100 మి.లీ.ను లీటరు నీటిలో కలిపి తయారు చేసిన 100 మి.లీ.ల విషపు ఎర ద్రావణాన్ని మట్టి పాత్రలలో పోసి చెట్లకు వేలాడదీయాలి.

2) రైతుపేరు: శివయ్య, గ్రామం: కంభం, మండలం: కంభం, జిల్లా: ప్రకాశం, ఫోన్ నెంబర్: 8977583878.

ప్ర: బీర కాయలో కొత్తగా వచ్చిన ఆకులను పురుగు తింటోంది, నివారణ తెలపండి ?

జ: బీర కాయలో ఆకుతినే పురుగు నివారణకు వేపనూనె (1500 పి.పి.యం) 5 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. మొక్కలు 2-4 ఆకుల దశలో ఉన్నప్పుడు బోరాక్స్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసి ఆడ పూల సంఖ్యను పెంచుకోవచ్చును.

3) పేరు: నెట్టికళ్ళప్ప గారి రఘునాధ రెడ్డి, గ్రామం: జక్కలవడికి, మండలం: కణేకల్లు, జిల్లా: అనంతపురం, ఫోన్ నెంబర్: 9441164938.

ప్ర: టమాటాలో కాయలపై గజ్జి లాంటి మచ్చలు ఏర్పడుతున్నాయి, నివారణ చెప్పగలరు ?

జ: టమాటాలో గజ్జి తెగులు నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 30 గ్రా. + (స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్ + టెట్రాసైక్లిన్ హైడ్రోక్లోరైడ్) 1 గ్రా.ను 10 లీటర్ల నీటికి చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలి.

4) రైతు పేరు: చందా సుంకన్న, గ్రామం: మద్దికెర, మండలం: మద్దికెర, జిల్లా: కర్నూలు, ఫోన్ నెం: 6304717680.

ప్ర : ఉల్లిగడ్డలో ఆకులపై తెల్లటి మచ్చలు ఏర్పడ్డాయి. నివారణ తెలుపగలరు ?

జ: ఉల్లిగడ్డలో తామర పురుగు నివారణకు ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. చొప్పున లీటరు నీటికి కలుపుకొని పిచికారీ చేసుకోవాలి. నీలి రంగు జిగురు అట్టలు ఎకరానికి 20 చొప్పున అమర్చుకోవాలి.

# సమీకృత రైతు సమాచార కేంద్రం (గన్నవరం) 155251 కు రైతుల స్పందన



రైతు పేరు: కేశవులు, గ్రామం: నింద్ర, మండలం: నింద్ర, జిల్లా: చిత్తూరు, ఫోన్ నెంబర్:9160153865.

చెరుకులో పేనుబంక నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రా. ను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేశాను. పురుగు ఉధృతి చాలా వరకు తగ్గింది. రైతు సమాచార కేంద్రం సిబ్బందికి కృతజ్ఞతలు.



రైతు పేరు: విప్పర్ల రామయ్య, గ్రామం: భూమనపల్లి, మండలం: దొనకొండ, జిల్లా: ప్రకాశం, ఫోన్ నెంబర్: 9398608828.

ఆముదంలో దాసరి పురుగు నివారణకు ఐ.సి.సి. సిబ్బంది సూచన చేసిన విధంగా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ.ను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేశాను. పురుగు తగ్గింది. పంట బాగుంది. చాలా ధన్యవాదాలు.



రైతుపేరు: యస్. శివ ప్రసాద్, గ్రామం : దుధ్యాల, మండలం : సంబేపల్లి, జిల్లా : అన్నమయ్య, ఫోన్ నెంబర్ :9989489340.

వేరుశనగలో ఆకు ముడత పురుగు (లీఫ్ మైనర్) నివారణకు సమీకృత రైతు సమాచార కేంద్రం సిబ్బంది సిఫారసు ప్రకారం నోవల్యూరాన్ 1 మి.లీ.ను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేశాను. పురుగు ఉధృతి చాలా వరకు తగ్గింది. కృతజ్ఞతలు.



రైతు పేరు: అబ్దుల్ రహీమ్, గ్రామం: సి. బెళగల్, మండలం: సి. బెళగల్, జిల్లా: కర్నూలు, ఫోన్ నెంబర్: 9347401708.

ఐ.సి.సి. సిబ్బంది వారి సూచన మేరకు గోరుచిక్కుడులో ఆకు మచ్చ తెగులు నివారణకు మాంకోజెబ్ 2.5 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేశాను. క్రొత్తగా ఏర్పడిన ఆకులకు, మొక్కలకు తెగులు సోకలేదు. పంట బాగుంది. ఐ.సి.సి. సిబ్బందికి ధన్యవాదాలు.



. రైతు పేరు: కె. గజేంద్ర నాయుడు, గ్రామం : గూడూరు, మండలం : గూడూరు, జిల్లా : కర్నూలు, ఫోన్ నెంబర్ : 7396975699.

దానిమ్మలో బాక్టీరియా ఎండు తెగులు నివారణకు 10 లీటర్ల నీటికి కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. మరియు స్ట్రెప్టోసైక్లిన్ సల్ఫేట్ 90% + టెట్రాసైక్లిన్ హైడ్రోక్లోరైడ్ 10% 1 గ్రా. చొప్పున కలిపి పిచికారీ చేశాను. సలహా ఇచ్చిన ఐ.సి.సి. వారికి నా అభినంధనలు.



రైతు పేరు: మోపూరి కేశవ రెడ్డి, గ్రామం: మెడికుర్తి, మండలం: యల్లనూరు, జిల్లా: అనంతపురం, ఫోన్ నెంబర్:9491431355.

బత్తాయిలో ఆకు నల్లి నివారణకు స్పైరోమేసిఫెన్ 0.8 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేశాను. పురుగు ఉధృతి కొంత వరకు తగ్గింది. సలహా ఇచ్చిన ఐ.సి.సి. వారికి నా అభినంధనలు.



రైతు పేరు : మల్లిబోయిన బాల నరసింహుడు, గ్రామం : వానిపెంట, మండలం : మైదుకూరు, జిల్లా: వై.ఎస్.ఆర్., ఫోన్ నెంబర్ : 9502280472.

వంగలోకాండం మరియు కాయతొలుచు పురుగు నివారణకు డెల్టామెత్రిన్ 1 మి.లీ.ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేశాను. పురుగు ఉధృతి కొంత వరకు తగ్గింది. ఐ.సి.సి. సిబ్బందికి ధన్యవాదాలు.

# వరిలో సుడి దోమ – నివారణ

## పురుగు ఎప్పుడు ఆశిస్తుంది

వరి పండించే అన్ని ప్రాంతాల్లో
ఈ దోమ నారుమడి లేదా పిలక దశలో అరుదుగాను,
పొట్ట దశ, ఈనిక దశల్లో ఎక్కువగానుఆశిస్తుంది.





## లక్షణాలు

- ★ దుబ్బులనుండి రసాన్ని పీల్చడం వల్ల పైరు లేత పసుపు వర్ణానికి మారుతుంది.
- ★ ఉధృతి పెరిగే కొద్దీ పైరు సుడులు సుడులుగా వలయాకారంలో ఎండిపోతూ ఉంటుంది

## సస్యరక్షణ చేపట్టు సమయం

పిలకల దశలో దుబ్బుకు 10 - 15 దోమలు,
ఈనిక దశలో దుబ్బుకు 20-25 దోమలు
గమనించిన వెంటనే సస్యరక్షణ చేపట్టాలి

## యాజమాన్యం

1. వరి నాటేటప్పుడు ప్రతి 2 మీటర్లకు 20 సెం.మీ. కాలి బాటలు తీయాలి
2. పొలాన్ని అడపాదడపా ఆరబెట్టాలి
3. నత్రజనిని అధిక మోతాదులో వాడరాదు
4. దోమను తట్టుకొనే రకాలు సాగు చేసుకోవాలి.

## నివారణా చర్యలు

ఎసిఫేట్ 75 SP 1.5 గ్రా. లేదా పైమెట్రోజైన్ 50 WG 0.6 గ్రా. లేదా ట్రైఫ్లూమిజోపైరిమ్ 10 SC 0.48 మి.లీ. లేదా ఫ్లోనికామిడ్ 50 SG 0.4 గ్రా. డైనోటెఫ్యూరాన్ 20 SG 0.4 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ + ఎథిప్రోల్ 80 WG 0.25 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

## వాడకూడనివి

దోమ ఉధృతికి దోహదపడే క్వినాల్ ఫాస్, ప్రొఫెనోఫాస్, మిథైల్ పారాథియాన్, ట్రైజోఫాస్,ఫోరేట్ 10 జి గుళికలు మరియు సింథటిక్ పైరిథ్రాయిడ్ వర్గానికి చెందిన డెల్టామెత్రిన్ , సైపర్ మెత్రిన్ వంటి పురుగు మందులను వాడరాదు

# మీకు తెలుసా...?

## డి.ఎ.పి. ఎరువుతో పోలిస్తే కాంప్లెక్స్ ఎరువులలో పంటకు పోషకాల లభ్యత ఎక్కువ



**పంట పెరుగుదల దశలో భాస్వరం కన్నా నత్రజని, పొటాష్ పోషకాల అవసరం ఎక్కువ**

- డి.ఎ.పి. ఎరువులో నత్రజని, భాస్వరం, మాత్రమే లభ్యమవుతాయి.
- కాంప్లెక్స్ ఎరువులలో నత్రజని, భాస్వరం పోషకాలతో పాటుగా పొటాష్, గంధకం వంటి ఇతర పోషకాలు కూడా పొందవచ్చును.
- కాంప్లెక్స్ ఎరువులలోని పొటాష్, గంధకం వంటి పోషకాల వల్ల నాణ్యత పెరిగి, చీడపీడలు తగ్గి, పంట దిగుబడులు పెరుగుతాయి.
- సమతుల ఎరువుల వినియోగం వలన నేల ఆరోగ్యం బాగుపడుతుంది
- అందువల్ల పంటలకు సిఫార్సు చేసిన కాంప్లెక్స్ ఎరువులు వాడటం శ్రేయస్కరం.




**సమతుల్యంగా పోషకాలని వాడుదాం..., పంటల దిగుబడులను పెంచుకుందాం.**



**గమనిక:**

డి.ఎ.పి. ఇచ్చే పోషకాలు ఇతర కాంప్లెక్స్ ఎరువులలోనూ లభ్యమవుతాయి, కనుక రైతులు కేవలం డి.ఎ.పి. పై ఆధారపడకుండా కాంప్లెక్స్ ఎరువుల రూపంలో పంటకు కావలసిన పోషకాలను అందించవచ్చు.

మరింత సమాచారం కోసం 155251 కు కాల్ చేయండి. లేదా మీ దగ్గరలో ఉన్న రైతు సేవా కేంద్రం ను సంప్రదించండి.